https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సార్ధ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 279 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ బుధవారం, ఆగస్టు,5, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-




## జిల్లా కలెక్టర్ దృష్టికి దామరగిద్ద మండల సమస్యలు..



- సింగారం స్టేజీపై కొనసాగుతున్న ఎస్సీ గురుకుల పాఠశాలను దామరగిద్ద మండల కేంద్రానికి తరలించాలి...
- నారాయణపేట జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్.. - ఆయా సమస్యలపై స్పందించిన జిల్లా కలెక్టర్..

**నారాయణపేట,(డీకే చాటింపు):**
నారాయణపేట జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక దామరగిద్ద మండల కార్యాలయాలన్నీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను తెలంగాణ రక్షణ సేన పార్టీ (టీఆర్ఎస్)నారాయణపేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ కలిసి దామరగిద్ద మండలంలో నెలకొన్న వివి ప్రధాన ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.
ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం సమీపంలో కొనసాగుతున్న ఎస్సీ గురుకుల పాఠశాలను దామరగిద్ద మండల కేంద్రానికి తరలించాలని కోరారు.అలాగే కందేన్ పల్లి గ్రామ ప్రభుత్వ భూమిలో ఎస్సీ గురుకుల హాస్టల్తో పాటు పాఠశాల భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దామరగిద్ద మండలం లోని ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని,పరిపాలన నిర్వహణకు అనువుగా లేకపోవడంతో నూతన భవనాలను మంజూరు చేయాలని కలెక్టర్ను కోరారు.
దామరగిద్ద తండాలోని ప్రభుత్వ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయని ఆయన కలెక్టర్ కు వివరించారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారిందని దామరగిద్ద తండా సర్పంచ్ శరణ్య నాయక్ తో కలిసి గవినోళ్ల శ్రీనివాస్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.
అందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ వెంబడే తండాను స్వయంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించి, నూతన పాఠశాల భవనం మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా కార్యదర్శి పల్లెబండ నర్సిములు,పార్టీ నాయకులు ఉలిగుండం మహేష్,మాజీ ఎంపీటీసీ సభ్యులు శేఖర్,లోకుర్తి మాజీ సర్పంచ్ సుదర్శన్,పిడ్డంపల్లి మాజీ సర్పంచ్ వీరేష్, తండా పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులకు క్యూ కడుతున్న ప్రజలు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి (డీకే చాటింపు):**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యాప్తంగా ప్రజలు రేషన్ షాపులకు క్యూ కడుతున్నారు. గతంలోమాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కూడా రేషన్ బియ్యాన్ని మూడు (ఆగస్టు,సెప్టెంబర్, అక్టోబర్) నెలలకూ ఒకేసారి ఇస్తుండటంతో లబ్ధిదారులు ఒకటో తేదీ నుంచే పెద్ద సంఖ్యలో వస్తున్నారు. దీంతో.. దాదాపు అన్ని రేషన్ షాపుల వద్ద సందడి నెలకొంది.
మూడు నెలలకూ ఒకేసారి బయోమెట్రిక్ చేసి బియ్యం ఇస్తుండటం, అదే సమయంలో రేషన్ కార్డులోని కుటుంబ సభ్యులందరి కేవైసీని చెక్ చేస్తుండటం వల్ల కొంత ఆలస్యం చోటుచేసుకుంటోంది. అయినా కూడా ప్రజలు గంటల తరబడి వేచిచూస్తున్నారు.

**స్టాక్ అయిపోతుందేమోనని..**
స్టాక్ అయిపోతే కొత్త స్టాక్ వచ్చే వరకు మళ్లీ కొద్దిరోజులు ఆగాల్సి వస్తుందేమోననే ఉద్దేశంతో ఇప్పుడే కొంచెం ఆలస్యమైనా బియ్యం తీసుకెళితే ఒక పని అయిపోతుంది కదా అని లబ్ధిదారులు చెబుతున్నారు. కేవైసీ చేయించుకునేందుకు ఈ నెలాఖరు వరకు గడువు పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పటికే చాలా మంది కేవైసీ చేయించుకున్నారు. చేయించుకోనివారికి మాత్రమే ఇప్పుడు బియ్యంతోపాటు కేవైసీ చేస్తున్నారు. రేషన్ షాపులను ఉదయం 8 లేదా 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 లేదా 5 గంటల నుంచి రాత్రి 8 లేదా 9 గంటల వరకు తెరిచి ఉంచుతున్నారు.

**ఇతర సరుకులు..**
రేషన్షాపుల్లో ఒక్కో లబ్ధిదారుడికి 6 కేజీలచొప్పున బియ్యంతోపాటు ఇతర సరుకులు కూడా తీసుకోవాలని కొన్ని చోట్ల డీలర్లు ఒత్తిడి తెస్తున్నారు. సబ్బులు, అప్పడాలు, ఉప్పు, పప్పు వంటివాటిని వారికి ఇష్టమొచ్చిన రేట్లకి ప్రజలకు అంటగడుతున్నారు.
వద్దు అని చెబుతున్నా వినిపించుకోవట్లేదు. కనీసం ఒక్కటైనా తీసుకోవాలని బలవంతం చేస్తున్నారు. గట్టిగా మాట్లాడితే బియ్యం ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా ఇబ్బందిపెడతారేమోనని లబ్ధిదారులు కిమ్మనట్లేదు.

**కొన్ని చోట్ల టోకెన్లు..**
పట్టణాల్లోని కొన్ని చౌక ధరల దుకాణాల్లో టోకెట్ విధానం అమలుచేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ముందు వచ్చినవారికి కొద్దిసేపు పరిమిత సంఖ్యలో టోకెన్లు ఇస్తూ అవి ఉన్నవారికి మాత్రమే రేషన్ బియ్యం పోస్తున్నారు. తర్వాత వచ్చేవారిని సాయంత్రం రమ్మని, లేదా రేపు పొద్దున రమ్మని తిప్పిపంపుతున్నారు. మరికొన్ని చోట్ల మాత్రం టోకెన్లు లేకుండానే వచ్చినవారికి వచ్చినట్లు నిర్దేశిత సమయాల్లో రేషన్ ఇస్తున్నారు. మొత్తమ్మీద లబ్ధిదారులు సన్నబియ్యం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా జరిగిన జే ఏ ఆర్ ఇన్ఫ్రా నూతన కార్యాలయ ప్రారంభోత్సవం

### జక్కిడి రఘువీర్ రెడ్డి జన్మదిన వేడుకలు


ఎల్బీనగర్, ఆగష్టు 4 (డీకే చాటింపు) ఎల్.బి.నగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని విజయశ్రీ కాలనీలో డివిజన్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి నూతనజే ఏ ఆర్ ఇన్ఫ్రాస్ కార్యాలయ ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి , మాజీ మంత్రివర్యులు, సూర్యపేట శాసనసభ్యులు శ్రీ గుంటకండ్ల జగదీశ్ రెడ్డి గారు, నల్గొండ మాజీ శాసనసభ్యులు శ్రీ కంచర్ల భూపాల్ రెడ్డి విచ్చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జక్కిడి రఘువీర్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, మహిళలు, యువత, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, స్నేహితులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వారి హాజరుతో కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఎంతో వైభవంగా జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులకు, ప్రజాప్రతినిధులకు, కాలనీ అసోసియేషన్ సభ్యులకు, మహిళలకు, యువతకు మరియు ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు జికిడి రఘువీర్ రెడ్డి .




## దామరగిద్ద తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- కలెక్టర్ వెళ్లిన సమయంలో తహశీల్దార్,డిప్యూటీ తహశీల్దార్ (డీటీ)లేరు
- దామరగిద్ద తాండను సందర్శించిన కలెక్టర్

నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా దామరగిద్ద తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సీ.హెచ్.ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆ సమయంలో కార్యాలయంలో తహశీల్దార్,డిప్యూటీ తహశీల్దార్(డీటీ)ఇద్దరూ లేకపోవడంతో వారు ఎక్కడికి వెళ్లారని సీనియర్ అసిస్టెంట్ను ప్రశ్నించారు. ఫీల్డ్ విజిట్కు వెళ్లినట్లు సీనియర్ అసిస్టెంట్ వివరించారు.అనంతరం రిజిస్ట్రేషన్ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్ రోజుకు ఎన్ని రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.. మంగళవారం ఎన్ని రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ ఆవరణలో ఓ మూలన ఫైళ్లను మూటకట్టి ఉంచడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.ఫైళ్లను ప్రత్యేక గదిలో భద్రంగా భద్రపరచకుండా ఇలా నిర్లక్ష్యంగా ఎందుకు ఉంచారని సీనియర్ అసిస్టెంట్ను ప్రశ్నించారు. తదనంతరం పక్కనే ఉన్న ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. మండలంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి.ప్రస్తుతం చేపడుతున్న ఉపాధి హామీ పనులు ఏమిటి..ఫామ్ పాండ్ల నిర్మాణాలు ఎంతవరకు పూర్తయ్యాయనే వివరాలను ఎంపీడీవో సాయిలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు.ఆ తర్వాత దామరగిద్ద తండాలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని,ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యపై ఆరా తీశారు.ఈ సందర్భంగా తండాకు నూతన పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ శరణ్ నాయక్ కలెక్టర్ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున తండా విద్యార్థులను దామరగిద్ద మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పంపే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.అయితే మండల కేంద్రంలోని పాఠశాలకు వెళ్లేందుకు తండా విద్యార్థులు ఆసక్తి చూపరని, తద్వారా గైర్హాజరు అయ్యే అవకాశముందని సర్పంచ్ వివరించారు.దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తండాకు రెండు ప్రైవేట్ పాఠశాల బస్సులు వస్తున్నాయని,వాటిలో విద్యార్థులు వెళ్తున్నప్పుడు ప్రభుత్వ పాఠశాలకు ఎందుకు వెళ్లలేరని ప్రశ్నించారు.ఎలాగైనా తండాకు నూతన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ శరణ్ నాయక్ మరోసారి కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.



## సర్పంచ్ జాడి లక్ష్మికి హరీష్ గౌడ్ క్షమాపణ చెప్పాలి.... తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం డిమాండ్...

బెల్లంపల్లి (డీకే చాటింపు ) నెన్నెల మండలంలోని జోగాపూర్--మైలారం బీటీ రోడ్డు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రోటోకాల్ను పాటించకుండా గొల్లపల్లి గ్రామ దళిత మహిళా సర్పంచ్ జాడి లక్ష్మిని అవమానించిన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్ గౌడ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలాలి నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి గోమాస రాజం, జాడి రాంచందర్, గొల్లపల్లి సర్పంచ్ జాడి లక్ష్మి, మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు చదువుల వెంకటరమణ మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొన్న జోగాపూర్--మైలారం బీటీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమానికి గొల్లపల్లి సర్పంచ్ జాడి లక్ష్మిని ఆహ్వానించినప్పటికీ, ఆమె చేత కొబ్బరికాయ కొట్టించి పనులు ప్రారంభించకుండా, ఎన్నికల్లో ఓటమి చెందిన దుర్గం ప్రసాద్తో ప్రారంభోత్సవం నిర్వహించడం దళిత మహిళా ప్రజాప్రతినిధిని అవమానించడమేనని ఆరోపించారు. గ్రామ సర్పంచ్కు ప్రోటోకాల్ ప్రకారం ఇవ్వాల్సిన గౌరవాన్ని ఉద్దేశపూర్వకంగా నిరాకరించారని విమర్శించారు. ఈ విషయాన్ని సర్పంచ్ జాడి లక్ష్మి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని, దళిత మహిళా సర్పంచ్ అవమానానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం విచారకరమని పేర్కొన్నారు. హరీష్ గౌడ్ వెంటనే సర్పంచ్ జాడి లక్ష్మికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆయన నివాసాన్ని ముట్టడించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అలాగే ఎమ్మెల్యే పేరు చెప్పి మండలంలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న డబ్బుల వసూళ్ల వ్యవహారంపై కూడా పూర్తి వివరాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు.ఈ సమావేశంలో నేతకాని సంక్షేమ సంఘం నాయకులు జాడి నారాయణ, బెడ్డల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు నానో ఎరువులు, పీఎస్బీ పంపిణీ

-సింగారంలో రైతులకు అవగాహన... -క్షేత్రస్థాయిలో వినియోగంపై ప్రదర్శన...

నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండలం సింగారం గ్రామ రైతులకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం(టిఆర్ వికె) నారాయణపేట ఆధ్వర్యంలో నానో యూరియా,నానో డీఏపీ,ఫాస్ఫరస్ సొల్యూబిలైజింగ్ బయోఫెర్టిలైజర్(పిఎస్బి) లను మంగళవారం పంపిణీ చేశారు.టిఆర్ వికె నారాయణపేట సమన్వయకర్త డాక్టర్ ఈటెల సత్యనారాయణ రైతులకు వీటిని అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ నానో ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించడం ద్వారా పోషకాల వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు.అలాగే నేలలో మొక్కలకు అందుబాటులో లేని భాస్వరాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో పిఎస్బి బయోఫెర్టిలైజర్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని,రైతులు దీన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.అనంతరం రైతుల పొలంలో వరి నారు వేర్లను నానో డీఏపీ ద్రావణంలో ముంచే పద్ధతిపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు.నారు నాటే ముందు నానో డీఏపీ వినియోగించే విధానాన్ని రైతులకు వివరించారు. అదేవిధంగా వరి పంటలో పిఎస్బి వినియోగంపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించి,దాని ఉపయోగాలు, వినియోగ విధానాన్ని వివరించారు.
రైతులు శాస్త్రీయ ఎరువుల వినియోగ పద్ధతులను పాటిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవాలని డాక్టర్ సత్యనారాయణ సూచించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, నారాయణపేట సమన్వయకర్త ఈటెల సత్యనారాయణ,ఏఈఓ రమేష్,సింగారం గ్రామ రైతులు పాల్గొన్నారు.



## బొందుకూరి శ్రీనివాసచారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించిన ముడిమాల చిన్న సిద్దయ్య ఆచార్యుల

-బొందుకూరి శ్రీనివాసచారి గృహాన్ని సందర్శించిన ముడిమాల చిన్న సిద్దయ్య ఆచార్యుల

జగిత్యాల,ఆగష్టు 4 (డీకే చాటింపు) సిద్ధప్ప పీఠాధిపతి వీర బ్రహ్మంగారి శిష్యుడు సిద్ధయ్య గారి వంశంలో 8వ తరానికి చెందిన శ్రీ సిద్ధయ్య ముడి మాల ఆచార్యులు వారి కుమారుడు ముడిమాల చిన్న సిద్దయ్య ఆచార్యుల జగిత్యాల పర్యటనలో భాగంగా బొందుకూరి శ్రీనివాసచారి గృహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులకు ఆశీర్వాదాలు అందచేయడమే కాకుండా విచ్చేసిన భక్తులను ఉద్దేశించి సిద్ధయ్య గారి వంశ చరిత్ర గురించి తెలియజేశారు. వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు సామాజిక సమరసత వేదిక కరీంనగర్ సంయోజక్ చిట్ల గంగాధర్ గాయకురాలు వంగల శ్యామల బొందుకూరి నరేందర్ తుమ్మనపల్లి తిరుపతి మండలోజు బ్రహ్మానందం రవి తేజ తదితరులు పాల్గొన్నారు



## అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పది..: మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి-రమేష్

బెల్లంపల్లి (డీకే చాటింపు ): మంగళవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్న దాన కార్యక్రమం 423 వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి-రమేష్ హాజరై అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఐదు సంవత్సరాలు గా బాటసారులు నిరుపేదల ఆకలి తీర్చుతున్న జనహిత సేవలు అభినందనీయం అని అన్నారు.జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 423 వ సారి దాత కీ.శే.కారుకూరి సాయి కుమార్ జయంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి వరలక్ష్మీ-రాంచెందర్ దంపతులు అన్న దానం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో దాత మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచెందర్ పలువురు బెల్లంపల్లి మండల మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు మరియు జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్,కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, సహాయ కార్యదర్శి గొడిసెల శేఖర్,కార్యవర్గ సభ్యులు నిచ్చకోల గురుస్వామి, చిలుముల సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు



# ఆ ఇద్దరు ఎవరు...?

విజయవాడ, : ఏపీలో ఇద్దరు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పదవీకాలం పూర్తైంది. ఎమ్మెల్సీలు జకియా ఖానం, రవీంద్రబాబు పదవీకాలం పూర్తయ్యింది. శాసనమండలి అధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఎమ్మెల్సీ పదవి కోసం టీడీపీలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. పలువురు సీనియర్ నేతల పేర్లు రేసులో వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై అధినేత చంద్రబాబు నాయుడు ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పదవీకాలం పూర్తయ్యింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన జకియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీకాలం పూర్తయ్యింది. ఈ మేరకు శాసనమండలి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జకియా ఖానం ప్రస్తుతం ఏపీ శాసనమండలి డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో కొత్త ఎమ్మెల్సీల ఎంపికతోపాటుగా.. డిప్యూటీ ఛైర్ పర్సన్ ఎన్నిక కూడా చేపట్టాల్సి ఉంది. మరోవైపు శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి వైసీపీ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పేరు గట్టిగా వినిపిస్తోంది. ఈ పదవి కోసం వరుదు కళ్యాణి, ఇసాకా భాషాల పేర్లు వినిపించినప్పటికీ.. మాధవరావువైపు వైసీపీ మొగ్గుచూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి ఎన్నిక జరిగేలోగా పేరును అధికారికంగా ప్రకటించవచ్చని సమాచారం.మరోవైపు ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం టీడీపీలో ఆశావహుల జాబితా పెరుగుతోంది. పలువురు సీనియర్ నేతలు ఎమ్మెల్సీ స్థానం కోసం రేసులో ఉన్నారు. రెండు స్థానాల కోసం ఏకంగా 20 మంది వరకూ పోటీ పడుతున్నట్లు తెలిసింది. రాజ్యసభ అవకాశం చేజార్చుకున్న సీనియర్ నేతలు, గతంలో సీటు ఆశించి భంగపడ్డ నాయకులు ఈ జాబితాలో ఉన్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, టీడీ జనార్ధన్, వంగవీటి రాధా, బుద్ధా వెంకన్న, గొట్టిపాటి రామకృష్ణ, తిప్పేస్వామి, శ్రీనివాసులరెడ్డి వంటి నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే కసరత్తు జరుపుతున్నట్లు తెలిసింది. రెండు స్థానాలను కూడా టీడీపీనే తీసుకుంటుందనే వార్తలు వస్తున్నాయి.ఇటీవల భర్తీ చేసిన రాజ్యసభ స్థానాలలో ఒకటి జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాళీ అవుతున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలను తామే తీసుకునే ఆలోచనలో టీడీపీ ఉన్నట్లు సమాచారం. దీనిపై కూటమిలోని భాగస్వామ్య పార్టీలు అయిన బీజేపీ, జనసేనతో చంద్రబాబు చర్చించనున్నట్లు తెలిసింది. ఇక ఏపీ శాసనమండలిలో మొత్తం 58 ఎమ్మెల్సీ స్థానాలు ఉన్నాయి. శాసనసభ్యులు, స్థానిక సంస్థల కోటా నుంచి 20 మంది చొప్పున, పట్టభద్రులు, ఉపాధ్యాయుల కోటా నుంచి ఐదుగురి చొప్పున.. గవర్నర్ కోటా నుంచి 8 మంది సభ్యులను ఎంపిక చేస్తారు.

# గోదావరి జిల్లాల్లో ఎవరి లెక్కలు వారివి



కాకినాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ లాంటి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికార కూటమి పచ్చని సంసారంలో స్థానిక సంస్థల ఎన్నికల సెగలు రేపుతోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మధ్య మైత్రి ఫెవికాల్ బంధంలా అత్యంత బలంగా కనిపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి సీన్ పూర్తిగా మారుతోంది. సార్వత్రిక ఎన్నికల నాటి త్యాగాలు, సర్దుబాట్లు ఒకెత్తయితే.. ఇప్పుడు ముంచుకొస్తున్న స్థానిక సంస్థల సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వేళ ఏ గ్రామానికి ఆ గ్రామంలో సీట్ల పంచాయితీ ముదిరిపాకాన పడుతోంది. పొత్తుల రొంపిలో ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, అటు తమ్ముళ్లు, ఇటు జనసైనికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.ముఖ్యంగా పిఠాపురం, భీమవరం, అమలాపురం నియోజకవర్గాల అంతర్గత గ్రామాల్లో టీడీపీ-జనసేన లీడర్ల మధ్య నడుస్తున్న కోల్డ్ వార్ ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా రచ్చకెక్కుతోంది. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పల్లెల్లో ప్రెసిడెంట్ సీటు ఎవరిదనే దానిపై హోరాహోరీ పోరు సాగుతోంది. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని, కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన స్థానిక టీడీపీ నేతలు.. ఎమ్మెల్యే సీటునే జనసేనకు త్యాగం చేశాం, కనీసం ఊరి సర్పంచ్ సీటైనా మాకు ఇవ్వకపోతే ఎలా అని గట్టిగా నిలదీస్తున్నారు. మరోవైపు, తమ అధినేత నియోజకవర్గం కాబట్టి మెజారిటీ గ్రామాలు తమకే దక్కాలని జనసైనికులు పట్టుబడుతుండటంతో అంతర్గత వర్గపోరు పీక్స్‌కు చేరింది.పశ్చిమ గోదావరి కేంద్రమైన భీమవరంలోనూ ఇదే తరహా ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఏ గ్రామంలో ఏ పార్టీ వార్డు దక్కించుకోవాలి? ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? అనే అంశంపై ప్రతి ఊరిలోనూ రచ్చబండ పంచాయితీలు జరుగుతున్నాయి. ఉమ్మడి వేదికలపై పైకి నవ్వుతూ షేక్‌హ్యాండ్‌లు ఇచ్చుకుంటున్న స్థానిక నేతలు.. లోపల మాత్రం ఎవరికి వారు గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారు. ఒకరు పిలిచిన కార్యక్రమాలకు మరొకరు డుమ్మా కొట్టడం, లోకల్ వాట్సాప్ గ్రూపుల్లో పరోక్ష విమర్శలతో పోస్టులు పెట్టుకోవడం వంటి పరిణామాలు క్షేత్రస్థాయిలో అసంతృప్తికి అద్దం పడుతున్నాయి. అమలాపురం రూరల్ పరిధిలో సమీకరణాలు మరింత క్లిష్టంగా మారాయి. ఇక్కడ సామాజిక వర్గాల ఈక్వేషన్లు ఎప్పుడూ హాట్ టాపిక్కే. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ.. నిధుల కేటాయింపులు, గ్రామీణ పనుల కాంట్రాక్టుల విషయంలో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నేతల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా క్షేత్రస్థాయిలో మాకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదు అనే గుబులు జనసేన కిందిస్థాయి లీడర్లలో కనిపిస్తుంటే.. మెజారిటీ ఓటు బ్యాంకు మాదే, సీట్ల కేటాయింపులో సింహభాగం మాకే దక్కాలి అని తమ్ముళు వాదిస్తున్నారు. ఈ పట్టువిడుపులు లేని ధోరణి ఉమ్మడి జిల్లాల అంతటా కూటమి సమన్వయాన్ని దెబ్బతీస్తోంది.అసెంబ్లీ సీట్ల సర్దుబాటు కంటే స్థానిక సంస్థల సీట్ల సర్దుబాటే చంద్రబాబు-పవన్ కళ్యాణ్‌లకు అసలైన పరీక్ష అని చెబుతున్నారు. ఎందుకంటే ఎమ్మెల్యే సీటు అనేది నియోజకవర్గానికి ఒక్కటే ఉంటుంది కాబట్టి నచ్చజెప్పడం సులువు. కానీ, వేలాదిగా ఉండే వార్డులు, వందలాదిగా ఉండే సర్పంచ్ స్థానాల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా సదరు లీడర్ రెబెల్‌గా మారే ప్రమాదం ఉంది లేదా పక్కనే పొంచి ఉన్న విపక్ష వైఎస్సార్‌సీపీకి లాభం చేకూర్చే అవకాశం ఉంది. గోదావరి జిల్లాల్లో ఏ మాత్రం తేడా వచ్చినా అది రాష్ట్ర వ్యాప్త కూటమి గ్రాఫ్‌పై ప్రభావం చూపిస్తుంది. ముగింపుగా చెప్పాలంటే.. గోదావరి జిల్లాల గ్రామాల్లో తమ్ముళ్లు, సైనికుల మధ్య సాగుతున్న ఈ సీట్ల పంచాయితీని అధిష్టానం ఎంత త్వరగా సెటిల్ చేస్తే అంత మంచిది. పైస్థాయిలో ఉన్న దోస్తీ.. కిందిస్థాయి గడప దాకా చేరకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాల కోటల్లో అంతర్గత తిరుగుబాట్లు తప్పవు. మరి ఈ పొత్తుల రొంపి నుంచి ఇరు పార్టీల స్థానిక లీడర్లను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎలా గట్టెక్కిస్తారో చూడాలి.

# బొండా ఉమా ఎపిసోడ్

## టీడీపీ క్రమశిక్షణకు చంద్రబాబు కఠిన పరీక్ష



**విజయవాడ,** : విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బొండా ఉమామహేశ్వరరావు వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ, అధికారిక కూటమిలోనూ తీవ్ర దుమారాన్ని రేపుతోంది. గుంటూరులో నిర్వహించిన దివంగత ముద్రగడ పద్మనాభం సంతాప సభలో బొండా ఉమా పాల్గొని, వైఎస్సార్సీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుతో ఆప్యాయంగా వేదిక పంచుకోవడం, ఆలింగనం చేసుకోవడం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో టీడీపీ అధిష్టానం దీన్ని తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణించింది. దీనికి తోడు కాపు సామాజిక వర్గ డిమాండ్లను సరిగా పట్టించుకోకపోవడం వల్లే 2019లో టీడీపీ ఓడిపోయింది అంటూ బొండా ఉమా చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీకి పెద్ద తలనొప్పిగా మారాయి.ఈ పరిణామంపై ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధినేత నారా చంద్రబాబు నాయుడు అత్యంత కఠినంగా స్పందించారు. పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఆయన.. సమాజంలో కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టడమే ఎజెండాగా పనిచేస్తున్న వైసీపీ నేతలతో ఏ ఒక్క టీడీపీ నాయకుడు కూడా వేదికలు పంచుకోవడానికి వీల్లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ విస్తరిస్తున్న రాజకీయ ఉచ్చులో పడొద్దని హెచ్చరించడమే కాకుండా, పార్టీ క్రమశిక్షణా రేఖను దాటి ప్రవర్తించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, శాశ్వతంగా దూరం పెట్టేందుకైనా వెనుకాడబోమని హెచ్చరిస్తూ గట్టి సందేశాన్ని పంపారు. ఈ వ్యవహారాన్ని కేవలం మౌఖిక హెచ్చరికలతో వదిలేయకుండా, బొండా ఉమా నుంచి వివరణ తీసుకోవడానికి టీడీపీ అధిష్టానం ముగ్గురు సభ్యులతో కూడిన త్రీమెన్ కమిటీ ని తక్షణమే ఏర్పాటు చేసింది. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కీలక నేత కిలారు రాజేష్‌లతో కూడిన ఈ కమిటీ ముందు హాజరై తన ప్రవర్తనపై, సభలోని వ్యాఖ్యలపై సరైన సమర్థన ఇవ్వాలని ఉమాకు ఆదేశాలు వెళ్లాయి. అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్ష నేతలతో వ్యక్తిగత, కుల సమీకరణల పేరుతో చనువు ప్రదర్శించడం శ్రేణుల్లో తప్పుడు సంకేతాలు పంపుతుందనేది అధిష్టానం ఆలోచనగా ఉంది.ఈ చర్యలు పార్టీలో కిందిస్థాయి నేతలకు హెచ్చరికగా నిలుస్తాయా లేక కొత్త వ్యూహాత్మక సంక్షోభాన్ని తెచ్చిపెడతాయా అనేది ఆసక్తికరంగా మారింది. తనపై వచ్చిన విమర్శలపై స్పందించిన బొండా ఉమా.. తాను హాజరైంది వైసీపీ సభకు కాదని, కాపు సామాజిక వర్గ నేత సంతాప సభ మాత్రమేనని సమర్థించుకుంటున్నారు. ఇదే ముద్రగడ సంస్మరణ సభల్లో వైసీపీ నేతలతో వేదిక పంచుకున్న వంగవీటి రాధా, జ్యోతుల నెహ్రూ వంటి వారిని కూడా వివరణ అడుగుతారా అని ఆయన ప్రశ్నించడం పార్టీ అంతర్గత వర్గాల్లో పెద్ద చర్చకు తెరతీసింది. అధిష్టానం ప్రస్తుతం తీవ్రమైన ధర్మసందేహంలో పడింది. బొండా ఉమాపై కఠినంగా క్రమశిక్షణా చర్యలు లేదా సస్పెన్షన్ వేటు వేస్తే, దాన్ని ప్రతిపక్షాలు కాపు నేతలపై కక్షసాధింపు గా మలిచి రాజకీయ లబ్ధి పొందే ప్రమాదం ఉంది. అలాకాకుండా కేవలం వివరణతో సరిపెట్టి వదిలేస్తే, అధినేత చంద్రబాబు ఇచ్చిన కఠిన హెచ్చరికలకు విలువ లేకుండా పోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.పలువురు నేతలు వ్యక్తిగత అనుబంధాలు, సామాజిక వర్గాల పేరుతో ప్రత్యర్థి పార్టీ నేతలతో చనువుగా ఉండటం టీడీపీ కేడర్‌ను గందరగోళానికి గురిచేసింది. ఇప్పుడు ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న వేళ, ప్రతిపక్ష వైసీపీకి ఎలాంటి రాజకీయ మైలేజ్ దక్కకుండా చూడటమే లక్ష్యంగా చంద్రబాబు ఈ కొత్త రూల్‌ను కఠినంగా అమలు చేయాలని నిశ్చయించుకున్నారు. త్రీమెన్ కమిటీ నివేదిక ఆధారంగా రాబోయే రోజుల్లో తీసుకోబోయే నిర్ణయం.. ఇతర టీడీపీ నాయకుల నడతను, పార్టీలో క్రమశిక్షణా ప్రమాణాలను శాసించే కీలక మలుపుగా మారనుంది.

# మొన్న దువ్వాడ, నిన్న సిదిరి.. ఇవాళ తమ్మినేని

**శ్రీకాకుళం,** : ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ( ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ )కి బలమైన ప్రాంతంగా గుర్తింపు పొందింది. 2019 ఎన్నికల్లో మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించినప్పటికీ, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. టీడీపీ కూటమి ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాలో తిరిగి బలం పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.2024 ఎన్నికల తర్వాత జిల్లాలో వైసీపీ పార్టీని సమన్వయం చేసే బలమైన నాయకత్వం లేకపోవడం, అంతర్గత విభేదాలు, వర్గ రాజకీయాలు పార్టీ పునర్నిర్మాణానికి అడ్డంకిగా మారుతున్నాయి. ఇదే సమయంలో కీలక నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలవడం కూడా పార్టీకి ఇబ్బందికర పరిస్థితులను తీసుకొస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల మాజీ స్పీకర్, మాజీ మంత్రి తమ్మినేని సీతారాం పేరు భూ వివాదానికి సంబంధించిన కేసులో రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. సుమారు రూ.4 కోట్ల విలువైన భూమికి సంబంధించిన వ్యవహారంలో అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందనే ఆరోపణలపై కేసు నమోదైనట్లు సమాచారం. ఈ ఆరోపణలను చట్టపరమైన విచారణలో అధికారులు పరిశీలిస్తున్నారు. కేసుకు సంబంధించి తమ్మినేని సీతారాం లేదా ఆయన కుటుంబం నుంచి పూర్తి స్థాయి స్పందన రావాల్సి ఉంది. కాబట్టి ఆరోపణలు ఇప్పటికీ న్యాయపరమైన విచారణ దశలోనే ఉన్నాయిఈ పరిణామాల నేపథ్యంలో తమ్మినేని సీతారాం రాజకీయ భవిష్యత్తుపై కూడా చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. భవిష్యత్‌లో లోక్‌సభ ( ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆయన కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్ ను ఆముదాలవలస ( అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దించాలని కుటుంబం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో భూ వివాదం రాజకీయంగా ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురవుతున్న సవాళ్లు ఒక్క తమ్మినేని సీతారాంతోనే పరిమితం కాలేదు. టెక్కలి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. మరోవైపు పలాస మాజీ మంత్రి సీదరి అప్పలరాజు కుటుంబం కూడా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటనతో వార్తల్లో నిలిచింది. ఈ పరిణామాలు జిల్లాలో పార్టీ నాయకత్వంపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో మళ్లీ బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. 2024 ఎన్నికల పరాజయం నుంచి పూర్తిగా కోలుకుని కార్యకర్తల్లో నమ్మకం పెంచడం, కొత్త వ్యూహాలతో ముందుకు సాగడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక సవాలుగా మారింది.అయితే రాజకీయ పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందులను పార్టీ ఎలా అధిగమిస్తుంది, జిల్లాలో తిరిగి తన బలాన్ని ఎలా పెంచుకుంటుంది, కీలక నాయకులు తమపై వచ్చిన వివాదాలను ఎలా ఎదుర్కొంటారు అన్నదే రానున్న రోజుల్లో శ్రీకాకుళం జిల్లా రాజకీయాల దిశను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనుంది.

# స్థానిక ఎన్నికల్లో వైసీపీకి చావుదెబ్బ.. కూటమి ప్లాన్ అదుర్స్




**విజయవాడ, జూలై 23 :** కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధపడుతోంది. సాధారణంగా పంచాయతీ ఎన్నికలు అనేవి ముందుగా జరపడం సహజం. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం మున్సిపల్ ఎన్నికల వైపు మొగ్గు చూపింది. ముందుగా పట్టణాల్లో ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించింది. దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. 100కు పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లను కైవసం చేసుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కోలుకోలేని దెబ్బతీయాలన్నది కూటమి ప్రణాళికగా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే పట్టణ ప్రాంతాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా బలహీనంగా ఉంది. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చావు దెబ్బ తీసేందుకు ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు కూటమి అడుగులు వేస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ప్రాదేశిక.. చివరిగా పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది.పట్టణాల్లో విద్యాధికులు, ఉద్యోగ ఉపాధ్యాయులు అధికంగా ఉంటారు. అయితే వారిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ఒక రకమైన వ్యతిరేక భావన ఉంది. పైగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలు కూడా పట్టణ ప్రాంత ప్రజలకు నచ్చడం లేదు. ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనలు కూడా మింగుడు పడడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో సంక్షేమ పథకాలు అమలు చేయడం వంటి కారణాలతో వైసిపికి ఓటు బ్యాంకు స్థిరంగా ఉంది. ఆపై స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ఇటీవల వరకు కొనసాగారు. వారు పట్టు నిలుపుకుంటూ వచ్చారు. అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహిస్తే కూటమికి కాస్త ఇబ్బందికరంగా ఉండే అవకాశం ఉంది. పైగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు అనే మాట ఉండకూడదు అని జగన్ సొంత పార్టీ క్యాడర్కు హెచ్చరించారు. అలా చేస్తే పార్టీ నియోజకవర్గ బాధ్యతలను మార్చేస్తానంటూ ఇంచార్జ్‌ను హెచ్చరించారు. అందుకే ముందుగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించి తర్వాత మిగతా స్థానిక సంస్థలకు నిర్వహించాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది.పట్టణాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉండడంతో ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు రావడం ఖాయం. పైగా మూడు పార్టీల కలయికతో కూటమి దూకుడుగా ఉంటుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కలిపేందుకు ఏ పార్టీ ముందుకు రాదు. పైగా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అనుసరించిన తీరు ఆ పార్టీ శ్రేణులకు తెలుసు. అధికార పార్టీ ఎలాంటి దూకుడు కనబరుస్తుందో ఆ పార్టీకి తెలియంది కాదు.. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బ కొట్టి.. మిగతా ప్రాదేశిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది కూటమి. చివరిగా గ్రామీణ ప్రాంతాలకు ప్రతీకలుగా నిలిచే పంచాయితీలను ఏకపక్షంగా గెలుచుకొని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకునే పరిస్థితి లేకుండా చేయాలన్నది కూటమి ఆలోచన. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ నుంచి డిసెంబరు లోపు మొత్తం స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో

# తెలుగు రాష్ట్రాల్లో వానలు..వానలు



**విజయవాడ 29 :** తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. గత కొద్ది రోజులుగా ఏపీ, తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయి. మొన్నటివరకు ఎండలతో ప్రజలు అల్లాడిపోగా.. కొద్దిరోజులుగా కురుస్తున్న వానలతో ఊరట చెందుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కూడా పడుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తొలకరి పలకరించినా, నైరుతి రుతుపవనాలు విస్తరించినా ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు అనుకున్నంతగా కురవలేదు. గతంలో పోలిస్తే లోటు వర్షపాతం భారీగా నమోదైంది. పలు జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావం మరింతగా ఉంటుందని వాతావరణశాఖ ఇప్పటికే ప్రకటించింది. నేటి వెదర్ రిపోర్ట్ విషయానికొస్తే.. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు వాతావరణశాఖ అధికారులు వర్షసూచన జారీ చేశారు. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.జులై 24వ తేదీన ఏపీలోని పలు జిల్లాలకు అమరావతి వాతావరణ కేంద్రం వర్షసూచన జారీ చేసింది. చిత్తూరు, కాకినాడ, పోలవరం, ఎన్టీఆర్, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అక్కడక్కడ పిడుగులు పడతాయని హెచ్చరించింది. ఇక విశాఖపట్నం, పల్నాడు, బాపట్ల, మర్కాపురం, నంద్యాల, ప్రకాశం, అనకాపల్లి జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు ఛాన్స్ ఉందని తెలిపింది. కొన్నిచోట్ల పిడుగులు పడే అవకాశముందని, వర్షం పడే సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించింది. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద, ఎత్తైన ప్రదేశాల్లో ఉండవద్దని తెలిపింది. రైతులు, కూలీలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇక వర్షాలు పడే సమయంలో భారీగా ఈదురుగాలులు వీస్తాయని, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద ఉండవద్దని సూచనలు చేసింది. వానలు పడేటప్పుడు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.ఇక జైసల్మేర్, కోట, గుణ, దామోహ్, డాల్టన్‌గంజ్, కాంటాయ్ మీదుగా ఆగ్నేయ దిశగా రుతుపవన ద్రోణి కొనసాగుతోంది. సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తువరకు విస్తరించి ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణశాఖ పేర్కొంది. దీని ప్రభావంతో తెలంగాణలో రాబోయే రెండ్రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయని తెలిపింది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో వానలు కురుస్తాయని హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని స్పష్టం చేసింది. జులై 26 తర్వాత రాష్ట్రంతో వర్షాల తీవ్రత పెరుగుతుందని హెచ్చరించింది. రాష్ట్రంలో లోటు వర్షపాతం కొనసాగుతోందని, గతంతో పోలిస్తే 25 శాతం తక్కువగా ఉందని పేర్కొంది. యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యధికంగా లోటు వర్షపాతం 60 శాతంగా ఉంది.

డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక
బుధవారం, ఆగస్టు.5, 2026

# మోడీ నా ప్రశ్నను కచ్చితంగా విన్నారు...



**ఓస్లో :** నార్వేకు చెందిన యువ జర్నలిస్టు హెల్లే ల్యాంగ్ స్వెండ్సెన్.. భారత ప్రధాని మోడీని మీడియా స్వేచ్ఛపై ప్రశ్నించిన తర్వాత తన సోషల్ మీడియా ఖాతాలు సస్పెండ్ అయ్యాయని ఆరోపించారు. నార్వే రాజధాని ఓస్లోలో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో మోడీ.. ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోయిన ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని ఆమె తెలిపారు. ఓస్లోలో నార్వే ప్రధానితో కలిసి మోడీ మీడియా ప్రకటన ముగించుకొని వెళ్లిపోతుండగా.. "ప్రపంచంలో అత్యంత స్వేచ్ఛాయుతమైన మీడియా ఉన్న దేశంలో జర్నలిస్టుల ప్రశ్నలు ఎందుకు తీసుకోరు?" అని స్వెండ్సెన్ ప్రశ్నించడం, దానికి మోడీ ఎలాంటి సమాధానమూ ఇవ్వకుండా అక్కడి నుంచి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారిన విషయం విదితమే. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా కూడా మారింది. ప్రపంచ మీడియా స్వేచ్ఛ సూచీలో నార్వే మొదటి స్థానంలో ఉండగా.. భారత్ 157వ స్థానంలో ఉందని ఆమె గుర్తు చేశారు.

కాగా మోడీని ప్రశ్నించిన తర్వాత కొద్ది గంటల్లోనే తన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాలు సస్పెండ్ అయ్యాయని స్వెండ్సెన్ చెప్పారు. "మోడీ దేశం విడిచిపోయిన వెంటనే నా ఖాతాలపై చర్యలు మొదలయ్యాయి. కొన్ని గంటల్లోనే మెటా నా అకౌంట్లు నిలిపివేయడం ఆశ్చర్యంగా అనిపించింది" అని ఆమె చెప్పారు. 'ది టెలిగ్రాఫ్ ఇండియా'కు ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు పంచుకున్నారు. టీవీ చర్చలు, సోషల్ మీడియాలో నాపై తీవ్ర విమర్శలు భారత టీవీ చర్చల్లో, సోషల్ మీడియాలో తనపై తీవ్ర విమర్శలు జరిగాయని స్వెండ్సెన్ తెలిపారు. 'పబ్లిసిటీ కోసం ఇలా చేసింది', 'భారత వ్యతిరేకి', 'విదేశీ ఏజెంట్' వంటి ఆరోపణలు తాను ఎదుర్కొన్నానని ఆమె చెప్పారు. మోడీ తన ప్రశ్న వినలేదన్న వ్యాఖ్యలను ఆమె ఖండించారు. "ఆయన కచ్చితంగా నా మాట విన్నారు. వినకపోతే ఆరోగ్య సమస్య ఉండి ఉండాలి. నేను చాలా దగ్గర్లోనే కూర్చున్నాను. చిన్న గదిలో రెండో వరుసలో ఉన్నాను" అని స్వెండ్సెన్ చెప్పారు. మోడీ ఆగి సమాధానం ఇచ్చి ఉంటే భారత్‌లో మానవ హక్కుల పరిస్థితిపై ప్రశ్నించేదానినని తెలిపారు. "మీ దేశంలో మానవ హక్కుల ఉల్లంఘనలపై ఎలాంటి మార్పులు తీసుకు రాబోతున్నారు? విమర్శలు స్వీకరిస్తారా? భారత్‌లో స్వతంత్ర జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారా?" అని అడిగేదాన్నని చెప్పారు. వివాదాన్ని భారత మీడియానే పెద్దది చేసింది ఈ వివాదాన్ని తనకంటే భారత మీడియానే పెద్దది చేసిందని స్వెండ్సెన్ విమర్శించారు. "మోడీపై మీడియా స్వేచ్ఛ ప్రశ్న అనే అసలు అంశం బదులు, జర్నలిస్టునే టార్గెట్ చేశారు" అని ఆమె అన్నారు.

## ట్రంప్ 'అబ్రహం అకార్డ్స్' మెలిక.. అడకత్తెరలో పాకిస్థాన్



అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహిస్తున్నామంటూ గొప్పలు చెబుతోన్న పాక్ పరిస్థితి ట్రంప్ ప్రతిపాదనతో ఇప్పుడు కుడితిలో పడిన ఎలుకలా మారింది. ఈ శాంతి ఒప్పందానికి 'అబ్రహం అకార్డ్స్ మెలికపెట్టిన అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్.. అందులోకి పాక్‌ను ఆహ్వానించారు. దీంతో మన దాయాది పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. పైగా ఇందుకు సంబంధించిన పోస్ట్‌లో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ప్రస్తావించకపోవడం ఆ దేశానికి మరింత అవమానకరం.

# మరో వెనిజులాను కానివ్వం!



హవానా : జనవరిలో వెనిజులాపై సైనిక చర్యకు పాల్పడి నికొలస్ మదురోను నిర్బంధించిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృష్టి కమ్యూనిస్టు క్యూబాపై పడింది. వెనిజులాపై జరిపిన మాదిరిగానే క్యూబాపై కూడా దాడి చేసి ఆ దేశాన్ని తన అధీనంలోకి తీసుకోవాలని ట్రంప్ విశ్వప్రయత్నం చేస్తున్నారు.

అయితే అమెరికా సామ్రాజ్యవాదానికి తలవంచే ప్రసక్తే లేదని క్యూబా స్పష్టం చేస్తోంది. వెనిజులా 2.0గా క్యూబా ఎందుకు మారదు అని ప్రశ్నిస్తే దానికి అనేక కారణాలు కన్పిస్తాయి. 1959లో ఫిడెల్ కాస్ట్రో విప్లవం తర్వాత క్యూబా అనేక దశాబ్దాలుగా అమెరికాను శత్రువుగానే చూస్తోంది. వెనిజులా సైన్యంతో పోలిస్తే క్యూబా సేనలు సైద్ధాంతికంగా పాతుకుపోయాయి. వారి మధ్య సమన్వయం ఎక్కువ. వారిలో పోరాట పటిమ అధికంగా ఉంటుంది. వెనిజులా నేత నికొలస్ మదురోకు భద్రత కల్పించిన అనేక మంది క్యూబా సైనికులు అమెరికా దాడిలో మరణించారు. ఆ దాడి నుంచి బయటపడిన వారికి అమెరికా దళాల వ్యూహం ఎలా ఉంటుందో బాగా తెలుసు. నిఘా, ఇంటెలిజెన్స్ వ్యవస్థల విషయానికి వస్తే క్యూబా పటిష్టంగా ఉంది. సంవత్సరాల తరబడి రష్యా, చైనాలతో కొనసాగిన సహకారమే దీనికి కారణం. ఇరాన్‌పై జరిపిన యుద్ధంలో అమెరికాకు రోజుకు బిలియన్ డాలర్లు ఖర్చయ్యాయి. ఇప్పుడు అమెరికా భారీ బడ్జెట్ లోటునుఎదుర్కొంటోంది. ఇలాంటి పరిస్థితులలో క్యూబాపై అమెరికా కయ్యానికి కాలు దువ్వుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. వెనిజులాలో మదురోను తొలగించడం ద్వారా ఆ దేశంతో వ్యాపార సంబంధాలను ట్రంప్ మార్చుకోగలిగారు. కానీ క్యూబా విషయంలో అలా కాదు. అక్కడ అధికారులు మారితే తప్ప ట్రంప్ ఏమీ చేయలేరు. ట్రంప్‌కు సహకరించేందుకు క్యూబా అధికారులు ససేమిరా అంటున్నారు. వెనిజులాలో మదురో ప్రభుత్వం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సహకరిస్తోందన్న ఆరోపణతో ఆ దేశంపై దాడికి ట్రంప్ తెగబడ్డారు. కానీ క్యూబాపై దాడి చేయడానికి ఆయనకు అలాంటి కారణమేదీ లేదు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అమెరికాకు సహకరిస్తున్నామని క్యూబా ప్రభుత్వం చెబుతోంది.

## ట్రంప్ చైనా పర్యటన విఫలమా! సఫలమా..!

ప్రపంచంలో ఇద్దరు శక్తివంతులైన నేతలు చైనా రాజధాని బీజింగ్‌లో భేటీ అయ్యారు. సహజంగానే ఈ కలయిక ఫలితాలు, పర్యవసానాల గురించి చర్చ జరుగుతోంది. అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ రెండవసారి చైనా సందర్శించాడు. పర్యటనకు ముందు, తరువాత కూడా ఈ ఉదంతం గురించి పెద్ద ఎత్తున విశ్లేషణలు వెలువడ్డాయి. డ్రాగన్ దేశ సందర్శన విఫలమైందని, వాణిజ్య పోరు ఎదురుతన్నిందని, అమెరికన్ కార్పొరేట్లు నిరాశాపూర్వక ప్రయత్నాలు చేసినట్లు, ఇంకా అనేక అంశాల గురించి పుంఖాను పుంఖాలుగా వ్యాఖ్యలు, వివరణలు వెలువడ్డాయి. విజయవంతమైందనే మాట ఎక్కడా వినిపించలేదు. చైనాను ఒత్తిడి చేయటంలో విఫలం కావటాన్ని వాణిజ్య యుద్ధంలో ట్రంప్ ఓటమిగా కొందరు వర్ణించారు. ఆ పెద్ద మనిషి అంతగా కోరి మరీ ఎందుకు చైనా వెళ్లాడంటే...అమెరికా ఆర్థికంగా తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోందనే సమాధానం వచ్చింది. చైనా పర్యటన సమయంలో ట్రంప్ రేటింగ్ 34 శాతానికి దిగజారింది. రుణ భారం జిడిపికి వంద శాతం దాటింది. పులి మీద పుట్రలా ఇరాన్‌పై దాడి చేసి మరింత లోతుగా కూరుకుపోయింది. గౌరవప్రదంగా ఇరాన్‌తో రాజీ కుదర్చాలనే ఎజెండా తెర వెనుక ఉందని చెబుతున్నారు. వ్రతం చెడ్డా ఫలం దక్కలేదు. చైనా పైచేయిగా ఉందని వాషింగ్టన్ మేథో సంస్థ విదేశీ వ్యవహారాల మండలి (సి.ఎఫ్.ఆర్) వ్యాఖ్యానించిందంటే పరిస్థితి ఏమిటో వేరే చెప్పనవసరం లేదు. అమెరికాలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ వాటి వెనుక టెస్లా కంపెనీ యజమాని ప్రపంచ ధనికుడు ఎలన్ మస్క్, అందరికీ సుపరిచితమైన యాపిల్, బ్లాక్ రాక్, ఎన్‌విడియా, బోయింగ్, జి.ఇ, మైక్రాన్ ఇలా అనేక కంపెనీల అధిపతులు ఉంటారు. ఎవరు మంత్రులు కావాలో, ఏ విధానాలను అనుసరించాలో కూడా నిర్దేశించేది వారే. ఈ బృందం ఆశాభంగం చెందటానికి కారణాలు ఏమిటి? గతంలో చైనాకు అవసరమైన చిప్స్‌ను సరఫరా చేయటంలో ఎన్‌విడియా కంపెనీ వాటా 95 శాతం ఉండగా ఇప్పుడు సున్నా శాతానికి పడిపోయింది. చైనాకు అవసరమైన ఆధునిక చిప్స్‌ను సరఫరా చేయకూడదన్న ఆదేశాలకు సదరు కంపెనీ తలొగ్గింది. సవాలుగా తీసుకున్న చైనా తన స్వంత కంపెనీలను ప్రోత్సహించి చిప్స్‌ను అభివృద్ధి చేసుకుంటున్నది. విధి లేక నిషేధం ఎత్తివేసిన తరువాత చూద్దాం, అవసరమైనపుడు మేమే సంప్రదిస్తాం అన్నట్లుగా చైనా అటువైపే చూడలేదు. అందుకే ఆ కంపెనీ యజమాని ట్రంప్‌తో పాటు బీజింగ్ వెళ్లాడు. నూట నలభై కోట్ల జనాభాలో 2027 నాటికి 120 కోట్ల మంది మధ్య తరగతిలో ఉంటారని అంచనా. ప్రపంచంలో వీరి వాటా 25 శాతం. ఇంత మంది వినియోగదారుల మార్కెట్‌ను అమెరికా కార్పొరేట్లు వదులు కుంటాయా? వాటికి కావాల్సింది లాభాలు, వాటి కోసం రాజకీయాలు చేస్తాయి, అవి తమకు ఆటంకంగా మారినపుడు ప్లేటు ఫిరాయిస్తాయి. సంస్కరణలంటే మన మాదిరి విదేశాలకు ఏకపక్షంగా తలుపులు బార్లా తెరవటం కాదు. మనం ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ నిర్దేశిత విధానాల చట్రంలో చేస్తే దానికి భిన్నంగా టెక్నాలజీ అందిస్తే మార్కెట్‌లో అవకాశమిస్తాం అనే షరతు మీద చైనా కమ్యూనిస్టులు వ్యవహరించారు. ట్రంప్ తొలిసారి అధికారానికి వచ్చినపుడు 2018లో వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించాడు. పెద్ద మొత్తంలో అమెరికా పెట్టుబడులు తగ్గించాడు, వాణిజ్యమూ తగ్గింది. అయినా గడచిన ఎనిమిది సంవత్సరాల్లో చైనాకు స్వల్ప సమస్యలు తప్ప అదేమీ కుప్పకూలి పోలేదు. వాణిజ్యం తరువాత చిప్ వార్‌ను ప్రారంభించాడు. దాన్ని కూడా సవాలుగా తీసుకొని మీ చిప్స్ మాకు అవసరం లేదనట్లుగా ఇప్పుడు చైనా ఉంది. దాంతో చైనా పట్ల వైఖరిని మార్చుకోవాలని కొన్ని పెద్ద కార్పొరేట్ కంపెనీలు ఒత్తిడి తెచ్చిన కారణంగానే పిలవక పోయినా పెద్ద సంఖ్యలో వాటి యజమానులను వెంటేసుకొని ట్రంప్ బీజింగ్ వెళ్లాడు. చైనా కనీసం ఐదు వందల విమానాలను కొనుగోలు చేస్తుందని కొందరు జోశ్యం చెప్పారు. చివరికి దీని గురించి అడిగితే చైనా ప్రతినిధి సమాధానాన్ని దాటవేయటంతో బోయింగ్ కంపెనీ వాటాల ధరలు నాలుగు శాతం పడిపోయాయి. ఎన్‌విడియా చిప్స్ కంపెనీకి సైతం ఇదే ఆశాభంగం ఎదురైందని వార్తలు. బీజింగ్ తన ప్రయోజనాలను ఫణంగా పెట్టుకొని తమకు రాయితీలు ఇస్తుందని ట్రంప్ ఎలా ఆశించాడు, ఆలోచించాడన్నది ఒక చిక్కు ప్రశ్నగా మారింది. కొన్ని దేశాల్లో దళారీ బూర్జువా శక్తులు వ్యక్తిగతంగా తాము లబ్ధి పొంది దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టి అమెరికా, ఇతర ధనిక దేశాలకు సహకరించినట్లుగానే చైనా కమ్యూనిస్టులు చేస్తారని ఆశించినవారు భంగపడ్డారని వేరే చెప్పనవసరం లేదు. ఇరాన్ నుంచి తనకు చమురు అందకుండా చేసేందుకు అమెరికా కుట్రలు తెలిసిందే.

### రెండో విడత చర్చలకు సిద్ధం వెల్లడించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్


# చర్చలకు ఇరాన్ తిరస్కరణ



పాకిస్తాన్‌కు వెళ్లనున్న యూఎస్ ప్రతినిధులు
అమెరికాకు ఇజ్రాయిల్ గొప్ప మిత్రదేశం : ట్రంప్
చాలా దూరంలో తుది ఒప్పందం : ఇరాన్
బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసేస్తాం : హౌతీలు

న్యూయార్క్ / టెహ్రాన్ : పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చలకు సిద్ధమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిపే చర్చల కోసం అమెరికా ప్రతినిధులు సోమవారం ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నారని ట్రంప్ ప్రకటించారు. ఆదివారం సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్‌లో.. ఇస్లామాబాద్‌లో ఇరాన్ ప్రతినిధులతో జరగనున్న రెండో విడత ముఖాముఖి చర్చలకు అమెరికా ఏ అధికారులను పంపుతుందో ట్రంప్ వివరంగా చెప్పలేదు. గత వారాంతంలో జరిగిన చర్చలలో అమెరికా ప్రతినిధి బృందానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాయకత్వం వహించారు. కానీ ఆ చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిశాయి.బుధవారం ముగియనున్న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని, శనివారం హోర్ముజ్ జలసంధిలో కాల్పులు జరపడం ద్వారా ఇరాన్ ఉల్లంఘించిందని ట్రంప్ ఆరోపించా రు. అమెరికా అందిస్తున్న ఒప్పందంలోని నిబంధనలను అంగీకరించకపోతే ఇరాన్‌లోని పౌర మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు. "మేం చాలా సరసమైన, సహేతుకమైన ఒప్పందాన్ని అందిస్తు న్నాం. వారు దానిని అంగీకరిస్తారని నేను ఆశిస్తున్నాను. ఎందుకంటే, వారు అంగీకరించకపో తే, యూఎస్..ఇరాన్‌లోని ప్రతి ఒక్క విద్యుత్ ప్లాంటును, ప్రతి ఒక్క వంతెననూ నాశనం చేయబోతోంది" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో రాశారు.

# ఆ సంకేతం ఇరాన్ ట్రాప్ అనుకొన్నాం: ట్రంప్



ఇరాన్‌లో కూలిపోయిన ఎఫ్–15ఈ స్ట్రైక్ ఈగిల్ పైలట్‌ను కాపాడే ఆపరేషన్ సమయంలో కొంతసేపు టెన్షన్ నెలకొన్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఆ ఫైటర్ జెట్ నుంచి ఎజెక్ట్ అయిన రెండో పైలట్ ఇరాన్ దళాల నుంచి తప్పించుకొని.. పర్వతాల్లో దాక్కొన్నాడని.. తొలుత అమెరికా నిఘా విభాగం అతడి లొకేషన్‌ను గుర్తించినట్లు పేర్కొన్నారు. కానీ, అతడి వద్ద నుంచి వచ్చిన సందేశం తమను గందరగోళంలో పడేసిందని ట్రంప్ తెలిపారు. రేడియో సిగ్నల్స్‌లో 'భగవంతుడిదే శక్తి' అన్నట్లు వినిపించిందని.. అది ముస్లింలు మాట్లాడినట్లు అనిపించిందన్నారు. ఆ తర్వాత ఆ సిగ్నల్‌ను 'గాడ్ ఈజ్ గుడ్'గా మిలిటరీ అధికారులు వెల్లడించారు. దీంతో అతడు ఇరాన్ దళాలకు దొరికిపోయి ఉంటాడని అనుమానించారు. వారే తప్పుడు సిగ్నల్స్‌ను ట్రాన్స్‌మిట్ చేస్తున్నట్లు భావించారు. కానీ, ఆ తర్వాత సదరు పైలట్ సజీవంగానే ఉన్నాడని గుర్తించారు. వాస్తవానికి యుద్ధం, విపత్కర పరిస్థితుల్లో దళాల సభ్యులు చిక్కుకొన్నవేళ వెంటనే ముందుగా అనుకొన్న కోడ్‌ను మర్చిపోయి.. సహజసిద్ధ శైలిలో స్పందిస్తుంటారు. ఈ పైలట్ విషయంలో కూడా అలానే జరిగింది. దీంతో కొంతసేపు టెన్షన్ నెలకొన్నా.. ఆ తర్వాత వచ్చిన కోడ్ సరైనదేనని నిర్ణయించుకొని ఆపరేషన్ చేపట్టారు.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే సారధ్యంలో చాటింపు తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# ఏపీ బీజేపీకి ఏమైంది...



**విశాఖపట్టణం, :** ఏపీలో భారతీయ జనతా పార్టీ పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. ఆ పార్టీ అనుకున్న స్థాయిలో ముందుకెళ్లడం లేదు. పొత్తులో భాగంగా సీట్లు, ఓట్లు పెరిగాయే తప్ప.. గత రెండు సంవత్సరాలుగా ఆ పార్టీ పుంజుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆ పార్టీలో పెద్దగా చేరికలు లేవు. చేరిన వారు సైలెంట్ గా ఉన్నారు. పాత నేతలు వ్యూహాత్మక సైలెన్స్ పాటిస్తున్నారు. పొత్తులో భాగంగా పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పని తాను చేసుకుంటున్నారు. ఎందుకో పార్టీని అభివృద్ధి చేసే ఆలోచన ఆ పార్టీ నేతల్లో కనిపించడం లేదు. ఏపీ విషయంలో హై కమాండ్ సైతం పెద్దగా పట్టించుకోవడం లేదు.రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ముగ్గురు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక రాష్ట్ర మంత్రి ఉన్నారు. ఒక కేంద్రమంత్రి కొనసాగుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తన ముద్ర చూపలేకపోతోంది ఏపీలో. కనీస స్థాయిలో చురుకైన పార్టీ కార్యక్రమాలు కూడా లేవు. అదే తెలంగాణలో అయితే నిత్యం బిజెపి పెద్దల పర్యటనలు, ప్రభుత్వ వైఫల్యాలపై కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ఏపీలో అది సాధ్యం కాదు. ఎందుకంటే బిజెపి ఇక్కడ మిత్రపక్షం. అయితే పార్టీ పరంగా కూడా యాక్టివ్గా కార్యక్రమాలు లేవు. ఇతర పార్టీల నుంచి చేరికలు లేవు. ఫలితంగా ఆ పార్టీ అనుకున్న స్థాయిలో పుంజుకోలేకపోతోంది.పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పివిఎన్ మాధవ్ వ్యవహరిస్తున్నారు. ఆయన బాధ్యతలు తీసుకున్నాక పార్టీ మరింత పుంజుకుంటుందని అంచనా వేశారు. కానీ ఎందుకో అనుకున్న స్థాయిలో ముందుకు వెళ్లలేకపోతోంది. పార్టీ బాధ్యతలు తీసుకున్న కొత్తలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలకు సిద్ధపడ్డారు మాధవ్. తరువాత చురుకుదనం తగ్గింది. కేవలం కూటమితో ముందుకు వెళ్లడమే తప్పించి.. స్వతంత్రంగా ఏపీలో పార్టీ ముందుకెళ్లే పరిస్థితి లేదు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. కనీసం బిజెపి ఉనికి చాటుకుంటుందా? లేదా అన్నది అనుమానమే. తమ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట కూడా స్థానిక నాయకత్వం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. అయితే భారీగా చేరికలు ఉంటాయని అప్పట్లో అంచనాలు ఉండేవి. కానీ ఎందుకో ఇప్పటికే చేరిన వారు యాక్టివ్ గా లేరు. అందుకే కొత్తగా ఎవరూ ముందుకు రావడం లేదు. మరి ఏపీ విషయంలో బిజెపి ఆలోచన ఏంటో ఇంతవరకు తెలియడం లేదు. ఇలా అయితే ఆ పార్టీకి కష్టమే

# బుట్టాయగూడెం- పట్టిసీమ- కొవ్వూరు
# రూ.705 కోట్లతో రెండు లైన్లుగా విస్తరణ



**ఏలూరు, :** ఏపీలో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న జాతీయ రహదారి విస్తకరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని నేషనల్ హైవే 365బీబీలో 44.70 కిలోమీటర్లు రెండు లైన్లుగా విస్తరించేందుకు మోర్త్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. రూ.705 కోట్లతో నిర్మించే ఈ హైవేలో రెండుచోట్లు బైపాస్‌లు కూడా ప్లాన్ చేస్తున్నారు. గతవారం మోర్త్ నుంచి హైవే విస్తరణకు లైన్ క్లియర్ అయ్యింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల విస్తరణపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా అనవరమైన చోట్ల రొడ్ల విస్తరణకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించగా.. ఒక్కో ప్రాజెక్టుకు లైన్ క్లియ్ అవుతోంది. తాజాగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని బుట్టాయగూడెం-పట్టిసీమ- కొవ్వూరు హైవే విస్తరణకు సంబంధించి కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది.. మొత్తం 44.70 కిలోమీటర్ల రోడ్డును విస్తరించనున్నారు. ఈ హైవేను రూ.705 కోట్లతో పది మీటర్ల వెడల్పు, రెండు వరుసలుగా విస్తరణను మోర్త్ (కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ) స్టాండింగ్ ఫైనాన్షియల్ కమిటీ ఆమోదించింది.నేషనల్ హైవే 365బీబీ తెలుగు రాష్ట్రాల మధ్య ఉంది.. ఈ రోడ్డు సూర్యాపేట నుంచి మొదలై ఖమ్మం, వైరా మీదుగా.. ఏపీలోని జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పట్టిసీమ మీదుగా కొవ్వూరు వరకు ఉంది. బుట్టాయగూడెం-పట్టిసీమ-కొవ్వూరు రోడ్డు 44.70 కిలోమీటర్లు విస్తరించలేదు. ఈ రోడ్డు ప్రాధాన్యతను గుర్తించిన ఎన్‌హెచ్ అధికారులు విస్తరించేందుకు మోర్త్‌కు ప్రతిపాదనలు పంపించారు.. కానీ కొన్ని కారణాలతో అనుమతులు ఆలస్యం అయ్యాయి. రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి ఈ రోడ్డు విస్తరణ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా.. మోర్త్ స్టాండింగ్ ఫైనాన్షియల్ కమిటీ సమావేశంలో ఆమోదం వచ్చింది.ప్రస్తుతం విస్తరించబోతున్న హైవేలో ఉన్న పట్టిసీమకు పోలవరం ప్రాజెక్ట్ 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. పోలవరం పూర్తిచేస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.. అప్పుడు పట్టి సీమ మీదుగా వాహనాల సంఖ్య పెరుగుతుంది. ఈ విషయాన్ని గుర్తించి పట్టిసీమ దగ్గర బైపాస్ నాలుగు వరుసలతో (3.20 కిమీ) కూడా రాబోతుండగా.. ఈ బైపాస్ కోసం డీపీఆర్ త్వరలో సిద్ధం చేయనున్నారు. కన్నాపురం దగ్గర మరో బైపాస్ ప్లాన్ చేయగా.. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఇటు పశ్చిమగోదావరి జిల్లాలో మరో హైవేను నాలుగు వరుసలుగా విస్తరించున్నారు. రూ.2,700 కోట్లతో ఆకివీడు నుంచి దిగమర్రు వరకు 40 కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరించనున్నారు. డీపీఆర్‌లో ఆకివీడు, ఉండి, భీమవరం దగ్గర బైపాస్‌లు ప్లాన్ చేశారు.

# కాపు ఓట్ల కోసం రేసు



**విజయవాడ, :** ఆంధ్రప్రదేశ్ లో కాపు సామాజికవర్గం ఓట్ల కోసం ఇప్పుడు రేసు ప్రారంభమయింది. అన్ని పార్టీలు కాపు సామాజికవర్గం ఓటు బ్యాంకును సొంతం చేసుకునేందుకు పోటీ పడుతున్నాయి. కాపు సమావేశాల పేరిట ఆ సామాజికవర్గానికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నాయి. వైసీపీ, టీడీపీ ఈ రకమైన ప్రయత్నాలు మొదలు పెట్టాయి. కాపులు తమ వెంటే ఉంటారని జనసేన మాత్రం కొంత వెనకబడి ఉన్నా పవన్ వెనకే ఉంటారన్న ధీమాలో ఉంది. ఇక బీజేపీ కూడా ఏ మాత్రం తగ్గడం లేదు. తరచూ సమావేశాలు పెట్టడంతో పాటు కాపు రిజర్వేషన్ల ఉద్యమాన్ని మరొకసారి తెరపైకి తెచ్చేందుకు వీరు ప్రయత్నిస్తున్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు సామాజికవర్గానికి అన్యాయం చేస్తుందని వైసీపీ ఆరోపిస్తుంది. కాపు కార్పొరేషన్ కు నిధులు మంజూరు చేయకపోగా వారికి పదవుల విషయంలోనూ ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెబుతోంది. ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బలంగా ఉన్న కాపు సామాజికవర్గం ఓటు బ్యాంకును తమ వైపునకు రప్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే తోట త్రిమూర్తులు అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వెంకటాపురంలో వైసీపీ కాపు నేతలతో సమావేశమై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు సిద్ధమవ్వాలని నిర్ణయించారు. వైసీపీ తర్వాత అన్ని ప్రాంతాల్లో సమావేశాలను ఏర్పాటు చేసి కాపు నేతలతో పాటు ప్రజలను కూడా ఏకతాటిపైకి తేవాలని ప్రయత్నిస్తున్నాయి. త్వరలోనే మరొక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు వైసీపీ సిద్ధమవుతుంది... టీడీపీ కూడా కాపు సామాజికవర్గంలో బలం మరింత పెంచుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. కాపు సామాజికవర్గం టీడీపీ నేతలు సమావేశమై దీనిపై చర్చించారు. అంతేకాకుండా ప్రభుత్వంపై కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని ఒత్తిడి తేవాలని నిర్ణయించాయి. దీనికి బొండా ఉమామహేశ్వరరావు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన కోస్తా జిల్లా నేత కావడంతో త్వరలోనే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పర్యటించి టీడీపీ కాపు సామాజికవర్గం నేతలను ఏకం చేయాలని ప్రయత్నంలో ఉన్నారు. మరొకవైపు టీడీపీ కాపులకు ఇస్తున్న ప్రాధాన్యత మరే ప్రభుత్వంలో ఇవ్వడం లేదని ప్రచారం చేయాలని కూడా నిర్ణయించారు. అధినాయకత్వం ఆశీస్సులతోనే ఈ కార్యక్రమానికి టీడీపీ కాపు సామాజికవర్గం నేతలు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. మొత్తం మీద ఈ రేసులో ఎవరిది పై చేయి అవుతుందన్నది రానున్న కాలమే చెబుతుంది.

పదవుల కోసం తపన

తెలుగుదేశం పార్టీలో కాపు నేతలు పదవుల కోసం పరితపిస్తున్నారు. ముఖ్యంగా తమకు మంత్రి పదవి దక్కలేదన్న భావన చాలా మందిలో ఉంది. జనసేన కారణంగానే తమకు మంత్రి పదవులు దక్కలేదన్న భావనలో వారిలో గట్టిగా ఉన్నట్లుంది. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తరచూ చేస్తున్న వ్యాఖ్యలు ఇందుకు అద్దం పడుతున్నాయి. అందుకే వీలు దొరికినప్పుడల్లా టీడీపీ కాపు సామాజికవర్గం నేతలు చేస్తున్న వ్యాఖ్యలు అదే అర్థం వచ్చేలా చెబుతున్నాయి. జనసేనతో పొత్తు తర్వాత తమకు ప్రాధాన్యత తగ్గిందన్న భావన కనిపిస్తుంది. తమ పార్టీకి చెందిన నాయకత్వాన్నే ఆయన ప్రశ్నిస్తున్నారు. పదే పదే బొండా ఉమామహేశ్వరరావు చేస్తున్న కామెంట్స్ పార్టీని ఇరకాటంలోకి నెడుతున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలోనూ బొండా ఉమామహేశ్వరరావు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మంత్రి పదవులు దక్కలేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు మాత్రం మంత్రి పదవులు వచ్చాయన్నారు. కొలుసు పార్థసారథి, సవిత, కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్ లకు మంత్రి పదవులు దక్కడాన్ని ప్రశ్నించారు. తాము మాచర్లలోనూ అనేక ఘటనలోనూ పార్టీకోసం ఇబ్బందులు పడినా మంత్రి పదవులు రాలేదన్నారు. కానీ పార్టీని నమ్ముకుని మాత్రమే పనిచేస్తామని చెప్పిన బొండా ఉమామహేశ్వరరావు తాజాగా ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు మరోసారి కలకలం రేపాయి.ముద్రగడ పద్మనాభం సంతాప సభలో టీడీపీ ఎమ్మెల్యే బాండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ముద్రగడ చేసిన పోరాటం వల్లే 2019 ఎన్నికల్లో టీడీపీ అధికారం కోల్పోవాల్సి వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు.ముద్రగడ సంతాప సభలో బొండా ఉమ వ్యాఖ్యలుముద్రగడ పద్మనాభం మరణం కాపు సామాజిక వర్గానికి తీరని లోటని ఆయన కొనియాడారు.కాపు జాతి హక్కుల కోసం, వారి అభ్యున్నతి కోసం ముద్రగడ జీవితాంతం నిర్విరామంగా పోరాడారని గుర్తుచేశారు.ఆయన ఆశయాలను సాధించడమే ముద్రగడకు అర్పించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.2019 ఎన్నికల సమయంలో ముద్రగడ చేపట్టిన ఉద్యమ ప్రభావం రాజకీయంగా తమ పార్టీపై గట్టిగా పడిందని, అందుకే టీడీపీ అధికారం కోల్పోయిందని ఓపెన్‌గా వ్యాఖ్యానించారు. అంతేకాదు.. పార్టీ నాయకత్వాన్ని కొందరు తప్పుదోవపట్టించి, ముద్రగడపై వ్యతిరేకత పెంచారని, అదే ఓటమికి కారణమయిందని అన్నారు. కాపు రిజర్వేషన్ల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని బొండా ఉమామహేశ్వరరావు చెప్పడం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. వైసీపీ నేతలతో కలసి కార్యక్రమంలో పాల్గొన్నందుకు బొండా ఉమామహేశ్వరరావుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నోటీసులు ఇవ్వాలని, వివరణ కోరాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు.

# పిఠాపురంలో పవన్ మార్క్..




**కాకినాడ, :** పిఠాపురం అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గత ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత ఈ నియోజకవర్గాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలపాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజల అవసరాలు ప్రాధాన్యతలను గుర్తించి వివిధ శాఖల అధికారులతో ఆయన తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వేగంగా చేరేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. అధికారులను నిరంతరం పరుగులు పెట్టిస్తూ అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతున్నారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.తాజాగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో వైద్య రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించడంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న పీఠాపురంలో ప్రధాన ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేయాలని దేవాదాయ శాఖను ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వంద భజన మందిరాల నిర్మాణానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. స్థల సేకరణ ఆలయ కమిటీల ఏర్పాటులో వచ్చే సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.వ్యవసాయ రంగంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ కోరారు. ఎల్నినో ప్రభావం వల్ల నీటి లభ్యత ఆధారంగా రైతులకు ముందుగానే నీటి విడుదల క్యాలెండర్ రూపొందించాలని సూచించారు. సాగునీరు సక్రమంగా అందకపోతే రైతులు నష్టపోతారని ముందస్తు జాగ్రత్తలు అవసరమని స్పష్టం చేశారు. మరోవైపు నియోజకవర్గంలో జరుగుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణాల నాణ్యతపై తీవ్రంగా స్పందించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే రెండొందల ఎనుబది ఎనిమిది సిమెంట్ రోడ్లు పూర్తయ్యాయని తెలిపారు. అయితే ఆ రోడ్ల నాణ్యతను స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకం విస్తరణ పనుల తీరుతెన్నులను కూడా ఆయన నిశితంగా పరిశీలించారు. ప్రతి గ్రామానికి శుద్ధి చేసిన తాగునీరు నిరంతరం అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధితో పాటు పనుల్లో పారదర్శకత నాణ్యత చాలా ముఖ్యమని పవన్ కళ్యాణ్ పదేపదే అధికారులకు గుర్తుచేస్తున్నారు. ప్రభుత్వ ధనం వృథా కాకుండా ప్రతి రూపాయి ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. రాబోయే కాలంలో పీఠాపురం నియోజకవర్గం దేశానికి రోల్ మోడల్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.త్వరలోనే పవన్ కళ్యాణ్ స్వయంగా పీఠాపురంలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. ఆ పర్యటనలో భాగంగా మరికొన్ని కొత్త అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ఆయన పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ పర్యటన ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. నాయకుడిలో ఉండాల్సిన పట్టుదల నిబద్ధత పవన్ లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధికారులతో నిరంతరం సమీక్షలు జరుపుతూ పనులను వేగవంతం చేయడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పీఠాపురం ప్రగతి ప్రయాణం ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలుస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి

# ఉండవల్లికి కీలక బాధ్యతలు..

**రాజమండ్రి, :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎప్పుడూ ఒక ఆసక్తికర చర్చగా మారుతూ వస్తుంది. ఒకప్పుడు రాష్ట్రాన్ని ఏలిన ఈ పార్టీ విభజన తర్వాత వరుసగా జరిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. చాలా ప్రాంతాల్లో డిపాజిట్లు కోల్పోయి కేవలం రెండు శాతం ఓటు బ్యాంకుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నది. ఇలాంటి క్లిష్టమైన సమయంలో పార్టీ బాధ్యతలు స్వీకరించడానికి చాలా మంది సీనియర్ నేతలు వెనకడుగు వేస్తూ వచ్చారు. విభజన అనంతరం రఘువీరా రెడ్డి, సాకే శైలజానాథ్, ఆ తర్వాత గోదావరి జిల్లాకు చెందిన నేతతో పాటు ప్రస్తుతం వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ బాధ్యతలు నిర్వర్తించారు. అయితే రానున్న రోజుల్లో ఏపీ కాంగ్రెస్‌లో భారీ ప్రక్షాళన జరగనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే హైకమాండ్ ఏపీ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించనుంది. పార్టీకి కొత్త జవసత్వాలు అందించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈసారి సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ తూకాలను ఖచ్చితంగా పరిగణలోకి తీసుకుంటారని తెలుస్తోంది. ఏపీలో అత్యంత బలమైన సామాజిక వర్గానికి చెందిన కీలక నేతకు పీసీసీ పీఠం దక్కే అవకాశం ఉందని సమాచారం. 2029 ఎన్నికల లక్ష్యంగా ఇప్పటి నుంచే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని జాతీయ నాయకత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే నాయకత్వ మార్పుతో పాటు కమిటీల ప్రక్షాళన చేపట్టాలని నిర్ణయించారు.గతంలో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని హైకమాండ్ కోరిన ఒక సీనియర్ పెద్దాయన సున్నితంగా తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. కేంద్రంలో కీలక మంత్రి పదవులు నిర్వహించిన ఆ గోదావరి జిల్లా నేతకు బాధ్యతలు ఇస్తే పార్టీ పుంజుకుంటుందని భావించారు. అయితే జాతీయ స్థాయిలో మారుతున్న రాజకీయ పరిణామాలు, దక్షిణాదిన కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ఆ పెద్దాయన ఆలోచనలో మార్పు వచ్చినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాహుల్ గాంధీ ఇమేజ్, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత తమకు కలిసి వస్తాయని ఆ నేతలు లెక్కలు వేస్తున్నారు. ఏపీ రాజకీయాల్లో నెలకొన్న శూన్యతను భర్తీ చేయడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నారు.ఈ రేసులో ఉత్తరాంధ్ర నుంచి ఒక కేంద్ర మాజీ మంత్రి పాటు రాయలసీమ ప్రాంతం నుంచి పలువురు సీనియర్ నాయకులు తీవ్ర ఆసక్తి కనబరుస్తున్నారు. గడచిన ఎన్నికల ఫలితాలతో పోలిస్తే 2029 ఎన్నికల వాతావరణం పూర్తిగా భిన్నంగా ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులు నమ్ముతున్నాయి. వైఎస్ షర్మిల నాయకత్వంలో జరిగిన ప్రయత్నాలు ఒక బేస్‌ను ఏర్పాటు చేశాయని, ఇప్పుడు దానిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలపై నమ్మకం ఉన్న ప్రజలు ఇంకా ఉన్నారని, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటే పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# 40 రోజుల్లో లోకల్ బాడీ ఎన్నికలు



**ఒంగోలు, :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న తరుణంలో.. స్థానిక సంస్థల ఎన్నికలను సైతం పూర్తి చేసి మిగతా రెండున్నర సంవత్సరాల పాలనను సజావుగా ముందుకు తీసుకెళ్లాలని భావిస్తోంది కూటమి ప్రభుత్వం. కేవలం 40 రోజుల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని లక్ష్యంతో ఉంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. ముందుగా మున్సిపల్ ఎన్నికలు, అదే సమయంలో ప్రాదేశిక ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తోంది. చివరిగా పంచాయతీ ఎన్నికలను పూర్తిచేసి స్థానిక సంస్థల కు పాలకవర్గాలను తేవాలని భావిస్తోంది. విజయదశమి నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలన్న ఆలోచనలో ఉంది కూటమి ప్రభుత్వం. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయితేనే ఆర్థిక సంఘం నిధుల విడుదలకు అవకాశం ఉంటుంది. కేంద్రం విడుదల చేసే నిధులకు మోక్షం కలుగుతుంది. అందుకే ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చింది.రాష్ట్రవ్యాప్తంగా ఏడు కార్పొరేషన్లతో పాటు 108 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పాలకవర్గం గడువు మార్చి తోనే ముగిసింది. ముందుగా మున్సిపల్ ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తాంది ప్రభుత్వం. దానికి కారణం లేకపోలేదు. పట్టణాల్లో కూటమి ప్రభుత్వం పట్ల సానుకూలత ఉంది. పైగా మిగతా మిత్రపక్షాలతో పోల్చుకుంటే టిడిపికి బలం ఎక్కువ. అందుకే పొత్తులో భాగంగా మున్సిపాలిటీలను జనసేనకు కేటాయించి.. మెజారిటీ మున్సిపాలిటీలను మాత్రం టిడిపి తీసుకోవాలని చూస్తోంది. బిజెపికి సైతం కొంత భాగస్వామ్యం ఇచ్చే ఛాన్స్ ఉంది. అయితే సెప్టెంబర్ మొదటి వారంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అక్కడకు పక్షం రోజుల వ్యవధిలోనే జడ్పీటిసి, ఎంపీటీసీ ఎన్నికలను పూర్తి చేయాలని భావిస్తోంది. ఎందుకంటే ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్తులు కాకుండా.. 26 జిల్లాలకు సంబంధించి జిల్లా పరిషత్తు ఎన్నికలు జరగనున్నాయి.చివరిగా పంచాయతీ ఎన్నికలను అక్టోబర్ మొదటి వారంలోనే మూడు విడతల్లో పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. అంటే విజయదశమి లోపు దాదాపు అన్ని స్థానిక సంస్థలకు పాలకవర్గాలు తేవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికలతో పాటు ప్రాదేశిక ఎన్నికల్లో సానుకూల ఫలితాలు వస్తాయి. ఆ ప్రభావం పంచాయితీ ఎన్నికలపై కూడా పడుతుంది. ఈ మొత్తం స్థానిక సంస్థల ఎన్నికల్లో 80 శాతం సీట్లను సంపాదించవచ్చు అనేది ప్రభుత్వ ఆలోచన. గతం మాదిరిగా కాకుండా.. ఏకగ్రీవాలను తగ్గించి.. పోటీ వైపే మొగ్గు చూపించి వైసిపికి మరోసారి షాక్ తినిపించాలని చూస్తోంది కూటమి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పక్కా వ్యూహం అమలు చేయనుంది. చూడాలి ప్రభుత్వ ప్రయత్నం, ఆలోచన ఎంతవరకు ఫలిస్తుందో..

# మళ్లీ అందుబాటులోకి ఆన్ లైన్ సేవలు....




ఈపీఎఫ్ఓ డిజిటల్ సేవలను మెరుగుపర్చింది. ఇక నుంచి క్లెయిమ్స్ మరింత వేగవంతం కానున్నాయి. ఈ మేరకు సిస్టమ్ ను ఈపీఎఫ్ఓ అప్ గ్రేడ్ చేసింది. ఇందుకోసం ఐదు రోజుల పాటు డిజిటల్ సేవలు నిలిపివేయగా.. నేటి నుంచి యూఏఎన్ పోర్టల్, ఉమాంగ్ యాప్‌లో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈపీఎఫ్ఓ ఖాతాదారులకు గుడ్ న్యూస్. ఐదు రోజుల పాటు నిలిచిపోయిన ఈపీఎఫ్ఓ ఆన్ లైన్ సర్వీసులు జులై 1వ తేదీ నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. సిస్టమ్ మైగ్రేషన్ కారణంగా తాత్కాలికంగా ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) యూఏఎన్ పోర్టల్, ఉమాంగ్ యాప్ లో పీఎఫ్ డిజిటల్ సేవలను నిలిపివేసింది. జూన్ 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిలిపివేసింది. అనంతరం జూలై 1వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయి. డేటాబేస్ ఏకీకరణ, సాఫ్ట్‌వేర్ అప్ గ్రేడ్ చేసేందుకు క్లెయిమ్ సమర్పణ, పాస్‌బుక్ డౌన్‌లోడ్‌లతో సహా అనేక సేవలను నిలిపివేసింది. అప్ గ్రేడ్ పూర్తవ్వడంతో నేటి నుంచి యూఏఎన్ పోర్టల్, ఉమాంగ్ యాప్ లో తిరిగి సేవలు ప్రారంభం కానున్నాయి. అప్ గ్రేడ్ చేయబడిన ప్లాట్‌ఫారమ్ వేగవంతమైన, మరింత విశ్వసనీయమైన, సురక్షితమైన సేవలను అందించనుంది. సాంకేతిక మౌలిక సదుపాయాలను ఆధునీకరించేందుకు, 7 కోట్లకు పైగా సభ్యుల వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరచడానికి ఈపీఎఫ్ఓ సిస్టమ్ అప్ గ్రేడ్ చేసింది. జూన్ 30న మైగ్రేషన్ ముగియడంతో.. జూలై 1 నుండి డిజిటల్ సేవలను తిరిగి పొందవచ్చు. తాత్కాలిక షట్‌డౌన్ కారణంగా క్లెయిమ్‌లు దాఖలు చేయడం లేదా పాస్‌బుక్‌లు డౌన్‌లోడ్ చేసుకోవడం వంటివి ఖాతాదారులు వాయిదా వేసుకున్నారు. అప్‌గ్రేడ్ చేసిన ప్లాట్‌ఫారమ్ అందుబాటులోకి రానుండటంతో యథావిధిగా సేవలు పొందవచ్చు. తమ ఆన్‌లైన్ సేవల వేగం, విశ్వసనీయత, భద్రతను మెరుగుపరచడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని ఈపీఎఫ్ఓ చెబుతోంది. సిస్టమ్ అప్ గ్రేడ్ అవ్వడంతో క్లెయిమ్స్ మరింత వేగవంతం కానున్నాయి. మాన్యువల్ అవసరం లేకుండా ఆటోమేషన్ పద్ధతిలో క్లెయిమ్స్ ప్రాసెస్ అవుతాయి. రూ.5 లక్షలలోపు క్లెయిమ్స్ ఆటోమేటిక్ గా ప్రాసెస్ చేస్తారు. దీంతో మూడు రోజుల్లోనే పీఎఫ్ నగదు పొందవచ్చు.


## వాట్సాప్ కొత్త ఫీచర్ యూజర్లకు తలనొప్పిగా మారనుందా?




ఇకపై మీరు ఎవరితోనైనా చాట్ చేయడానికి మీ వ్యక్తిగత మొబైల్ నంబర్‌ను పంచుకోవాల్సిన అవసరం లేదు. వాట్సాప్ మీ గోప్యతను పూర్తిగా మార్చే ఒక కొత్త ఫీచర్‌ను తీసుకురావడం ప్రారంభించింది. కానీ.. ఈ కొత్త ఫీచర్ మిమ్మల్ని మరింత సురక్షితంగా ఉంచుతుందా? లేక సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకునేలా చేస్తుందా? నిజానికి వాట్సాప్ ఈ కొత్త ఫీచర్‌ను అధికారికంగా ప్రారంభించింది. ఇప్పుడు మీరు మీ నంబర్‌ను పంచుకోకుండా, కేవలం 'యూజర్‌నేమ్' ద్వారా ఎవరితోనైనా చాటింగ్ ప్రారంభించవచ్చు. వినియోగదారుల ప్రైవసీని మెరుగుపరచడానికి ఈ ఫీచర్‌ను మొదటగా ప్రవేశపెట్టారు. ఈ ఫీచర్ కింద ఇన్‌స్టాగ్రామ్ లేదా ట్విట్టర్‌లో లాగానే, ప్రతి వినియోగదారుడు తమ కోసం ఒక ప్రత్యేకమైన యూజర్‌నేమ్‌ను రిజర్వ్ చేసుకోగలుగుతారు. అంతేకాకుండా, అదనపు భద్రత కోసం, మీకు 'యూజర్‌నేమ్ కీ' లేదా పిన్ ఎంపిక కూడా ఉంటుంది. దీనివల్ల కేవలం మీ యూజర్‌నేమ్ తెలుసుకోవడం ద్వారా అపరిచితులు మిమ్మల్ని నేరుగా వేధించలేరు లేదా సంప్రదించలేరు. చాలా మంది ఇలా ఆలోచిస్తూ ఉండవచ్చు మన యూజర్‌నేమ్‌తో వెతకడం ద్వారా ఎవరైనా మనల్ని కనుగొనగలరా? వాట్సాప్‌లో పబ్లిక్ యూజర్‌నేమ్ సెర్చ్ డైరెక్టరీ ఉండదు. దీని అర్థం, ఎవరైనా మీతో కనెక్ట్ అవ్వాలనుకుంటే, వారికి మీ ఖచ్చితమైన యూజర్‌నేమ్ తెలిసి ఉండాలి.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఖాతాను సృష్టించడానికి, ధృవీకరించడానికి మొబైల్ నంబర్ ఇప్పటికీ అవసరం అవుతుంది. యూజర్‌నేమ్ కేవలం సంప్రదించడానికి, చాట్ చేయడానికి మాత్రమే ఉపయోగించబడుతుంది. టెలిగ్రామ్ వంటి యాప్‌లు ఇప్పటికే ఇలాంటి సౌకర్యాన్ని అందిస్తున్నాయని, ఇప్పుడు వాట్సాప్ కూడా అదే మార్గాన్ని అనుసరించింది. తొలిచూపులో ఈ ఫీచర్ గోప్యతకు గొప్పగా అనిపించినప్పటికీ, సాంకేతిక నిపుణులు, భద్రతా సంస్థలు దీనిపై తీవ్ర హెచ్చరిక జారీ చేశాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ ఫీచర్ సైబర్ మోసాలకు భారీ ఊతం ఇవ్వగలదు. అతిపెద్ద ఆందోళన ఏమిటంటే, వినియోగదారుడు తనకు కావలసినప్పుడు, ఎన్నిసార్లు అయినా తన యూజర్‌నేమ్‌ను మార్చుకోగలగడం. ఇలాంటి పరిస్థితిలో ఒకవేళ మోసగాడు ఎవరినైనా మోసం చేస్తే అతను వెంటనే వారి యూజర్‌నేమ్‌ను మార్చేస్తాడు. దీనివల్ల వారి అసలు గుర్తింపును దాచుకోవడం చాలా సులభం అవుతుంది. దీనివల్ల సామాన్య ప్రజలు మోసానికి గురవడమే కాకుండా, నకిలీ ఐడీలను సృష్టించి గుర్తింపును దాచుకునే ఈ సౌకర్యం దేశ భద్రతకు కూడా తీవ్రమైన ముప్పును కలిగించగలదని నిపుణులు భావిస్తున్నారు. అయితే ఈ కొత్త వాట్సాప్ ఫీచర్ ప్రపంచవ్యాప్తంగా నెమ్మదిగా అందుబాటులోకి రావడం ప్రారంభమైంది. ప్రైవసీ విషయంలో ఇది ఒక పెద్ద ముందడుగు అయినప్పటికీ, భద్రత విషయంలో ఇది ఒక కొత్త సవాలును కూడా తీసుకొస్తుంది. ఇప్పుడు ఈ స్కామ్ ముప్పును ఎదుర్కోవడానికి వాట్సాప్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

## భారీగా తగ్గిన కమర్షియల్ ఎల్‌పిజి జెట్ ఫ్యూయెల్ ధరలు...



దేశంలోని వ్యాపార వర్గాలకు, విమానయాన రంగానికి కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు స్థిరంగా ఉండటం, మిడిల్ ఈస్ట్ లో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొంత మేర సడలడంతో చమురు మార్కెటింగ్ సంస్థలు ఇంధన ధరలను సవరిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. దీని ప్రకారం వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్లతో పాటు విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలను గణనీయంగా తగ్గించారు. సవరించిన ఈ కొత్త ధరలు తక్షణమే అమలులోకి రానున్నాయి. వ్యాపార వినియోగదారులకు పెద్ద ఉపశమనం కలిగిస్తూ 19 కేజీల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.183.50 మేర తగ్గించారు. ఈ తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ. 2,930కి చేరింది. దీనితో పాటు, చిన్న వ్యాపారులకు ఉపయోగపడే 5 కేజీల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను కూడా రూ.13 మేర తగ్గించారు.

ఈ నిర్ణయం వల్ల హోటళ్లు, రెస్టారెంట్లు, కేటరింగ్ సేవలు, చిన్న తరహా వ్యాపారాల నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గనుంది. అయితే, సామాన్య గృహ వినియోగదారులకు మాత్రం ఎలాంటి మార్పు లేదు. ఇళ్లలో వాడే 14.2 కేజీల గృహ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయకుండా యథాతథంగా ఉంచారు. మరోవైపు తీవ్ర ఒత్తిడిలో ఉన్న దేశీయ విమానయాన రంగానికి కూడా మంచి వార్త అందింది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరను లీటరుకు రూ.5 మేర తగ్గించారు. విమానయాన సంస్థల మొత్తం నిర్వహణ ఖర్చుల్లో ఇంధనానికే దాదాపు 35-40% ఖర్చవుతుంది. తాజా తగ్గింపుతో విమాన సంస్థల ఆపరేటింగ్ ఖర్చులు తగ్గి, రాబోయే రోజుల్లో ప్రయాణికులకు టికెట్ ధరల రూపంలో ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

## సుకన్య సమృద్ధి యోజనపీపీఎఫ్ ఖాతాదారులకు అలర్ట్...




భారత ప్రభుత్వం జూలై 1, 2026 నుండి ప్రారంభమయ్యే త్రైమాసికానికి గాను పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ వంటి వివిధ చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను మార్చకుండా యథాతథంగా ఉంచింది. వరుసగా తొమ్మిదో త్రైమాసికంలో కూడా ఈ వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయకపోవడం గమనార్హం. ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్ ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి (జూలై 1, 2026 నుండి సెప్టెంబర్ 30, 2026 వరకు) వర్తించే వడ్డీ రేట్లు, అంతకుముందు త్రైమాసికంలో ఉన్న రేట్ల ప్రకారమే కొనసాగుతాయి. ప్రభుత్వం చివరిసారిగా 2023-24 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో కొన్ని పథకాల వడ్డీ రేట్లలో మార్పులు చేసింది. ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఉద్దేశించిన ఈ ప్రజాదరణ పొందిన సుకున్య సమృద్ధి పథకంలో డిపాజిట్లపై అత్యధికంగా 8.2 శాతం వడ్డీ రేటు కొనసాగుతుంది.

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ పథకంపై వడ్డీ రేటు 7.7 శాతంగానే స్థిరంగా ఉంటుంది. కిసాన్ వికాస్ పత్రపై వడ్డీ రేటు 7.5 శాతంగా ఉంది. ఈ పథకంలో పెట్టుబడులు 115 నెలల్లో మెచ్యూర్ అవుతాయి.మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ కింద నెలవారీ ఆదాయాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు ఈ రెండో త్రైమాసికంలో కూడా 7.4 శాతం వడ్డీ లభిస్తుంది. ఉద్యోగులు, సాధారణ పెట్టుబడిదారులకు ఎంతో ఉపయోగపడే పీపీఎఫ్ ఖాతాలపై వడ్డీ రేటు 7.1 శాతంగానే కొనసాగుతుంది. మూడేళ్ల కాలపరిమితి గల టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేటు 7.1 శాతంగా ఉండగా..


వరుసగా తొమ్మిదో త్రైమాసికంలో కూడా ఈ వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయకపోవడం గమనార్హం. ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్ ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి (జూలై 1, 2026 నుండి సెప్టెంబర్ 30, 2026 వరకు) వర్తించే వడ్డీ రేట్లు, అంతకుముందు త్రైమాసికంలో ఉన్న రేట్ల ప్రకారమే కొనసాగుతాయి. ప్రభుత్వం చివరిసారిగా 2023-24 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో కొన్ని పథకాల వడ్డీ రేట్లలో మార్పులు చేసింది. ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఉద్దేశించిన ఈ ప్రజాదరణ పొందిన సుకున్య సమృద్ధి పథకంలో డిపాజిట్లపై అత్యధికంగా 8.2 శాతం వడ్డీ రేటు కొనసాగుతుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ పథకంపై వడ్డీ రేటు 7.7 శాతంగానే స్థిరంగా ఉంటుంది. కిసాన్ వికాస్ పత్రపై వడ్డీ రేటు 7.5 శాతంగా ఉంది. ఈ పథకంలో పెట్టుబడులు 115 నెలల్లో మెచ్యూర్ అవుతాయి.పోస్టాఫీస్ పొదుపు డిపాజిట్లపై వడ్డీ రేటు 4 శాతంగానే ఉంచబడింది.

## కోటక్ బ్యాంక్ చేతికి డాయిష్ రిటెయిల్‌ప్రైవేటు బ్యాంకింగ్ వ్యాపారాలు...




జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్‌కు మన దేశంలో ఉన్న రిటెయిల్, ప్రైవేటు బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యాపారాలను కొనుగోలు చేయడానికి ఒక కచ్చితమైన ఒప్పందంపై సంతకం చేసినట్లు ప్రైవేటు రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. ఎంత మొత్తానికి ఈ వ్యాపారాలను కొనుగోలు చేస్తున్నదీ వెల్లడించలేదు. ఈ ఒప్పందంతో సంపన్న, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారానికి మరింత మద్దతునివ్వాలని ఆశిస్తున్నట్లు తెలిపింది. కొనుగోలు చేయబోయే వ్యాపారాల్లో సుమారు రూ.29,000 కోట్ల రుణాలు, రూ.16,000 కోట్ల డిపాజిట్లు, రూ.10,500 కోట్ల నిర్వహణలో ఉన్న ఆస్తులు (ఏయూఎం) ఉన్నాయి. భారతదేశంలో తమ రిటెయిల్ వ్యాపారం నుంచి పాక్షికంగా వైదొలగిన అనేక ఇతర అంతర్జాతీయ బ్యాంక్‌ల సరసన డాయిష్ బ్యాంక్ కూడా చేరింది. ఈ మూడు వ్యాపార విభాగాల పరిధిలో బ్యాంకుకు 1,000 మంది ఉద్యోగులు ఉన్నారు. సుమారు 1.5 లక్షల మంది ఖాతాదార్లకు సేవలు అందిస్తున్నారు. ఒప్పంద లావాదేవీ పూర్తయిన తర్వాత ఈ ఉద్యోగులు కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో చేరతారని తెలుస్తోంది. వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి ఈ ఒప్పందం ముగింపు దశకు చేరుకుంటుందని అంచనా. కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), ఇతర నియంత్రణ ఆమోదాలకు లోబడి ఒప్పందం పూర్తవుతుందని తెలుస్తోంది.

## వాహనదారులకు గుడ్ న్యూస్....




అమెరికా, ఇరాన్ యుద్ధం కారణంగా నెలకొన్న ఇంధన సంక్షోభం వేళ.. భారీగా పెట్రోల్ రేట్లను పెంచిన నయారా ఎనర్జీ సంస్థ తమ కష్టమర్లకు శుభావార్తను అందించింది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ ఇంధన రిటైలర్ సంస్థ వాహనదారులకు భారీ ఊరటనిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు (అతీబీటవ రాతిశ్రీ) ధరలు గణనీయంగా తగ్గడంతో దేశవ్యాప్తంగా తమ బంకుల్లో ఇంధన ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఇందులో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ. 5, అలాగే లీటర్ డీజిల్‌పై రూ. 3 చొప్పున తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా 7,000 కంటే ఎక్కువ పెట్రోల్ పంపుల నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న నయారా ఎనర్జీ తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వచ్చింది. ఒకవైపు ప్రైవేట్ రంగ చమురు సంస్థ నయారా రేట్లను తగ్గించినప్పటికీ.. దేశంలో మెజారిటీ మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన
ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు మాత్రం ధరలను యథాతథంగా ఉంచాయి. ప్రైవేట్ బంకుల్లో ఇంధనం చౌకగా లభిస్తుండటంతో, ప్రభుత్వ రంగ సంస్థలు కూడా తక్షణమే స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని దేశవ్యాప్తంగా వాహనదారులు, రవాణా రంగ ప్రతినిధులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ సంస్థలు కూడా ధరలు తగ్గిస్తే సామాన్యులకు మరింత మేలు జరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఓల్టాస్ ఛైర్మన్ పదవికీ నోయల్ 'టాటా'



టాటా గ్రూపు సంస్థ ఓల్టాస్ ఛైర్మన్ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు నోయల్ టాటా ప్రకటించారు. టాటా గ్రూపునకే చెందిన మరో సంస్థ ట్రెంట్ ఛైర్మన్ బాధ్యతల నుంచి వైదొలిగిన దాదాపు వారం రోజులకే ఈ ప్రకటన రావడం గమనార్హం. ఓల్టాస్ 72వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో వాటాదార్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. 'మీకు తెలిసే ఉంటుంది కదా.. ఇదే నా చివరి ఏజీఎం' అని ఆయన తెలిపారు. అంతర్గత పదోన్నతులు, ఇతర సంస్థల నుంచి నియామకాల కలయిక ద్వారా కంపెనీ తన తదుపరి తరం సారథులను అభివృద్ధి చేసిందని తెలిపారు. నోయల్ టాటా జనవరి 27, 2003న ఓల్టాస్ బోర్డులో చేరారు. 2017 సెప్టెంబరు 1న ఓల్టాస్‌కు నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. టాటా సన్స్‌లో అతిపెద్ద వాటాదారు అయిన టాటా సన్స్‌కు ఛైర్మన్‌గా ఉన్న నోయల్ టాటా ఈ ఏడాది నవంబరులో 70 ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు. కంపెనీల చట్టం 2013 ప్రకారం.. 70 ఏళ్లు లేదా అంతకుమించి వయసున్న వారిని మేనేజింగ్ డైరెక్టరు లేదా పూర్తికాల డైరెక్టరుగా నియమించడం కానీ, పదవీకాలాన్ని పొడిగించడం కానీ చేయకూడదు.

# హెచ్ఎండీఏ సరికొత్త మాస్టర్ ప్లాన్..

## చిరు వ్యాపారుల కోసం వెండర్ జోన్లు




**హైదరాబాద్,** : హైదరాబాద్ నగరంలో చౌరస్తాలు, రోడ్ల పక్కన ఉన్న చిన్న చిన్న ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా కాపాడేందుకు, వాటి ద్వారా ఆదాయం పొందేందుకు హెచ్ఎండీఏలోని హుమ్టా సరికొత్త ప్రణాళిక రూపొందించింది. అక్రమ ఆక్రమణలను అరికట్టడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఈ స్థలాల్లో వెండర్ జోన్లు ఏర్పాటు చేసి షాపులు నిర్మించాలని నిర్ణయించారు. మొదటి దశలో అమీర్ పేట జంక్షన్, సత్యం థియేటర్ ఎదురుగా ఉన్న స్థలాల్లో ఈ వెండర్ జోన్లను అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ షాపులను నిర్మించి చిరు వ్యాపారులకు అద్దెకు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి శాశ్వత ఆదాయం సమకూరుతుందని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఆక్రమణల బారిన పడుతున్న చిన్నచిన్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంతో పాటు వాటి ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూర్చే దిశగా హెచ్ఎండీఏ పరిధిలోని హుమ్టా కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని ప్రధాన చౌరస్తాలు, రోడ్ల సమీపంలో నిరుపయోగంగా ఉన్న చిన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి, వాటిని ఆధునిక వెండర్ జోన్ల రూపంలో అభివృద్ధి చేయాలని భావిస్తోంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధుల్లోని పలు ప్రాంతాలలో ఈ సరికొత్త ప్రణాళికను అమలు చేయడానికి అధికారులు పకడ్బందీ సన్నాహాలు చేస్తున్నారు. నగరంలో చాలా చోట్ల ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్‌లను కొందరు ఆక్రమించుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండగా.. ప్రభుత్వానికి చెందిన విలువైన ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హుమ్టా అధికారులు చక్కని ప్రణాళిక సిద్ధం చేశారు. ఆయా స్థలాల్లో చిన్నచిన్న శాశ్వత షాపులు నిర్మించి వాటిని రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు అద్దెకు కేటాయించనున్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు ప్రభుత్వ భూములు కబ్జాదారుల నుంచి సురక్షితంగా ఉంటాయి. అంతేకాకుండా చిరు వ్యాపారులకు శాశ్వత ఉపాధి లభించి వారి జీవనోపాధి మెరుగుపడుతుంది. ఈ ప్రత్యేక ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి దశలో నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ముఖ్యంగా అమీర్ పేట జంక్షన్, సత్యం థియేటర్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ప్రస్తుతం అక్కడ కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా వాహనాల పార్కింగ్, చిన్న డబ్బాలు, తోపుడు బండ్ల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో తొలి విడతగా అమీర్ పేట ప్రాంతంలోనే అధికారికంగా వెండర్ జోన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులతో షాపులను నిర్మించి చిరు వ్యాపారులకు కేటాయించడం ద్వారా ప్రభుత్వానికి క్రమం తప్పకుండా అద్దెల రూపంలో ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొదటి దశ ప్రయోగం విజయవంతమైన తర్వాత నగరంలోని జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ పరిధుల్లో ఉన్న మిగతా ప్రధాన చౌరస్తాలు, రోడ్ల పక్కన ఉన్న ఖాళీ స్థలాలను కూడా ఇదే పద్ధతిలో అభివృద్ధి చేయాలని హుమ్టా ప్రణాళిక రూపొందించింది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారుల సహకారంతో ఈ సర్వేను వేగవంతం చేస్తున్నారు. అనధికార ఆక్రమణలను తొలగించి పారదర్శకమైన విధానంలో అర్హులైన చిరు వ్యాపారులకే ఈ షాపులను కేటాయించనున్నారు. దీనిద్వారా ప్రభుత్వ స్థలాలకు శాశ్వత రక్షణ లభించడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అదనపు ఆదాయం సమకూరుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# నల్గొండ కాంగ్రెస్ లో చిచ్చు...



**నల్గొండ,** : ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో విభేదాలు మళ్లీ బహిర్గతం అయ్యాయి. కోమటిరెడ్డి బ్రదర్స్‌పై ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తనకు సమాచారం ఇవ్వకుండా తన నియోజకవర్గంలోకి వచ్చారని.. ప్రోటోకాల్ ఉల్లంఘించారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రోడ్డు మంజూరు కోసం మంత్రి కోమటిరెడ్డి తిప్పించుకున్నారని.. రాజ్‌గోపాల్ రెడ్డి పార్టీ మారి తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చారని మండిపడ్డారు. తప్పుడు వ్యక్తిని గెలిపించానని రాజగోపాల్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కోమటిరెడ్డి సోదరులపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలతో.. కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత విబేధాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. తన తుంగతుర్తి నియోజకవర్గంపై కోమటిరెడ్డి బ్రదర్స్ పెత్తనం ఏంటని మందుల సామేల్ నిలదీశారు. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కల్లోలం బయటికి వచ్చింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై సొంత పార్టీ ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తనకు సమాచారం ఇవ్వకుండా తన నియోజకవర్గంలో పర్యటించడం ప్రోటోకాల్‌కు విరుద్ధమని ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లా మీ రాజ్యం అనుకుంటున్నారా అంటూ ప్రశ్నించిన మందుల సామేల్.. తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల గురించి వ్యాఖ్యలు చేసే ముందు మునుగోడు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి హితవు పలికారు. తాము ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో గెలిచామని.. ఎవరి దయాదాక్షిణ్యాలతో ఈ పదవిలోకి రాలేదని స్పష్టం చేశారు. తన నియోజకవర్గ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని తీవ్ర హెచ్చరికలు చేసిన మందుల సామేల్.. కాంగ్రెస్ పార్టీ కోసం లంబాడా సామాజిక వర్గం చేసిన సేవలను గుర్తించి వారికి మంత్రి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తన హక్కులను కాలరాస్తే పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని కూడా హెచ్చరించారు. 2 కిలోమీటర్ల రోడ్డు కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చుట్టూ వందసార్లు తిరిగానని మందుల సామేల్ పేర్కొన్నారు. మంత్రిగా ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. రాజగోపాల్‌రెడ్డికి తుంగతుర్తి నియోజకవర్గం గురించి ఎందుకని నిలదీశారు. తన నియోజకవర్గం జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని.. ఒకవేళ ప్రొటోకాల్ ఉల్లంఘించి.. తనకు సమాచారం లేకుండా తన నియోజకవర్గంలో అడుగుపెట్టే అధికారం ఎవరు ఇచ్చారని హెచ్చరించారు. మందుల సామేల్ తుంగతుర్తిలోనే ఉంటాడు ఖబడ్దార్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యక్తిగతంగా తనకు మందుల సామేల్‌తో ఎలాంటి విభేదాలు లేవని చెప్పారు. ఈ సందర్భంగా తుంగతుర్తి కాంగ్రెస్ కార్యకర్తలకు క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. అదే సమయంలో మందుల సామేల్‌కు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే టికెట్ ఇప్పించడంలో తానే కీలక పాత్ర పోషించానని తెలిపారు. ఆయనకు టికెట్ ఇవ్వడానికి ముందు తన ఇంటికి మందుల సామేల్ 100 సార్లు వచ్చాడని రాజ్‌గోపాల్ రెడ్డి తెలిపారు. పోటీలో చాలా మంది ఉన్నా మాట ఇచ్చినందుకు మందుల సామేల్‌కు టికెట్ ఇప్పించి, గెలిపించానని పేర్కొన్నారు. ఎన్నికల్లో మందుల సామేల్ గెలుపు కోసం ప్రచారం కూడా చేశానని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు మాత్రం ఒక తప్పుడు వ్యక్తిని గెలిపించానని బాధపడుతున్నానని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడటం తన బాధ్యత అని పేర్కొన్న రాజగోపాల్‌రెడ్డి.. పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు.

# ఈ 20 సెగ....




**చెన్నై,** : నీట్ పరీక్షల వివాదం తర్వాత, ఇప్పుడు దేశంలో తదుపరి జెన్ జీ, మధ్యతరగతి ప్రజాగ్రహానికి కేంద్రంగా ఇ20 పెట్రోల్ ఇంధన విధానం మారబోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. సాధారణ వాహనదారులు, ముఖ్యంగా డెలివరీ బాయ్స్, ఉద్యోగులు, ద్విచక్ర వాహనదారులు రోజువారీ మైలేజ్ తగ్గిపోవడం, ఇంజిన్ పార్ట్‌లు త్వరగా పాడైపోవడం, నిరంతర రిపేర్ల వల్ల ఖర్చులు పెరగడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ ఆగ్రహం నెమ్మదిగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపైకి, ముఖ్యంగా రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ వైపునకు మళ్లుతోంది. ఈ వివాదంలో గడ్కరీ సొంత ప్రయోజనాలు, ఆయన కుటుంబ లాభాలు దాగి ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో డిజిటల్ , ఏఐ డీప్‌ఫేక్ వీడియోలతో కూడిన ప్రచారం ఊపందుకుంది. అయితే, దీనిపై నితిన్ గడ్కరీ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ అనేది కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని విధానమని, రోడ్డు రవాణా శాఖ మంత్రిగా తనకు అందులో ఎలాంటి వ్యక్తిగత లేదా విధానపరమైన స్వార్థ ప్రయోజనాలు లేవని గడ్కరీ కోర్టులో స్పష్టం చేశారు. తన ప్రతిష్టకు భంగం కలిగించే దుష్ప్రచారాన్ని, డీప్‌ఫేక్ కంటెంట్‌ను తొలగించేలా మెటా, ఎక్స్, గూగుల్ సంస్థలపై సివిల్ దావా వేసేందుకు హైకోర్టు అనుమతి కూడా లభించింది. ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా ఇ20 వల్ల ఇంజిన్లకు ప్రమాదం లేదని, మైలేజ్‌లో కోత కేవలం 3 నుండి 5 శాతమేనని సర్దించుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయి అనుభవాలు భిన్నంగా ఉన్నాయన్నది వినియోగదారుల వాదన. ప్రత్యేకించి 2023 కంటే ముందు తయారైన లేదా ఇ20-కాంపాటిబిలిటీ లేని వాహనాలలో ఫ్యూయల్ లైన్లు, కార్బొరేటర్లు, రబ్బర్ సీల్స్ త్వరగా పాడవుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు బంకుల్లో సాధారణ పెట్రోల్ ఇ10 లేదా ప్యూర్ పెట్రోల్ ప్రత్యామ్నాయంగా లభించకపోవడం లేదా ఎక్కువ ధరకు అందుబాటులో ఉండటం మధ్యతరగతి జేబులపై అదనపు భారాన్ని మోపుతోంది. మహారాష్ట్ర రాజకీయ పరిణామాలు, మంత్రుల రాజీనామాల వార్తల వల్ల ఈ వివాదం కొంతకాలం పక్కదారి పట్టినట్లు అనిపించినా, స్థానికంగా నిరసన జ్వాలలు చల్లారలేదు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన ఆందోళనలతో పాటు, పార్లమెంట్ ముట్టడికి రవాణా సంఘాలు పిలుపునిచ్చాయి. రోజువారీ వాహనాలపై ఆధారపడే యువత, ఉద్యోగులతో కూడిన జెన్ జీ నెట్‌వర్క్ సామాజిక మాధ్యమాల్లో దీనిపై పెద్ద ఎత్తున డిజిటల్ క్యాంపెయిన్ నిర్వహిస్తోంది. నీట్ వివాదంలో మాదిరిగానే యువత వీధుల్లోకి వస్తే, అది కేంద్రానికి కోలుకోలేని దెబ్బగా మారే ప్రమాదం ఉంది. గతంలో కీలక సమస్యలు ఎదురైనప్పుడు మంత్రులపై రాజీనామా ఒత్తిడి పెరిగినట్లే, ఈ ఇంధన వివాదంలోనూ ప్రతిపక్షాలు, ఉద్యమకారులు గడ్కరీ టార్గెట్‌గా వ్యూహాలు రచిస్తున్నారు. . క్షేత్రస్థాయి అసంతృప్తికి తగిన పరిష్కారం చూపకపోతే, ఇది గడ్కరీకి మరియు మోదీ ప్రభుత్వానికి తీవ్రమైన రాజకీయ సంక్షోభాన్ని తెచ్చిపెట్టవచ్చు. ఈ వివాదాన్ని కేవలం దుష్ప్రచారం, పెట్రోలియం లాబీ కుట్ర"గా కొట్టిపారేయడం ద్వారా ప్రభుత్వం ఈ నిరసనలను ఆపడం కష్టం. పాత వాహనదారులకు అవసరమైన సాంకేతిక మద్దతు ఇవ్వడం లేదా పెట్రోల్ బంకుల్లో ప్యూర్ పెట్రోల్, ఇ10 ఆప్షన్లను సరసమైన ధరకు అందుబాటులో ఉంచడం వంటి సానుకూల చర్యలు తీసుకోవాలి. లేకపోతే, ఈ ఇ20 వివాదం డిజిటల్ స్పేస్ నుండి నేరుగా వీధుల్లోకి చేరి పెద్ద రాజకీయ ఉద్యమంగా రూపాంతరం చెందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేంద్రమే వేగంగా స్పందించాల్సి ఉంది.

# సివిల్ సర్వెంట్లపై ఏసీబీ గురి




**హైదరాబాద్,** : తెలంగాణ అవినీతి నిరోధక శాఖ రాష్ట్రంలో ఇప్పటివరకు ఎన్నడూ లేని స్థాయిలో అక్రమార్కులైన అధికారులపై సమగ్ర దోపిడీ చిట్టా ను సిద్ధం చేసి విరుచుకుపడుతోంది. గత ప్రభుత్వాల హయాంలో లేదా సురక్షితమైన లొసుగులను వాడుకుని లంచాల ఆరోపణల నుంచి తప్పించుకున్నామని భావిస్తున్న అనేక శాఖల అధికారుల పాత ఫైళ్లను ఏసీబీ తిరిగి తోడుతోంది. ముఖ్యంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, ఇంజనీరింగ్ , జీహెచ్ఎంసీ, ఆర్‌టీఏ, పోలీసు శాఖల్లో క్వాసి-జ్యుడీషియల్ , సివిల్ అధికారాలను అడ్డం పెట్టుకుని కోట్ల రూపాయలు గడించిన ఉన్నతాధికారులను టార్గెట్ చేస్తూ పక్కా ఆధారాలతో దాడులకు రంగం సిద్ధం చేసుకుంది. సాధారణంగా రాష్ట్ర ఏసీబీకి ఐఏఎస్ , ఐపీఎస్ వంటి అఖిల భారత సర్వీసు అధికారులపై దాడులు చేసే అధికారం ఉందా? అనే సాంకేతిక సందేహం కలగడం సహజం. చట్టపరంగా, నిరోధక చట్టం సెక్షన్ 17ఎ ప్రకారం, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై విచారణ లేదా దాడులు నిర్వహించాలంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి సంపూర్ణ స్వేచ్ఛను ఇవ్వడంతో పాటు, ముఖ్య కార్యదర్శి స్థాయి నుండి అవసరమైన చట్టబద్ధ ఆమోదాలు ముందస్తుగానే లభిస్తుండటంతో ఏసీబీకి సాంకేతిక, న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. దీనివల్ల ప్రాథమిక ఆధారాలు ఉన్న ఏ స్థాయి ఉన్నతాధికారి ఇంటిపైనైనా దాడి చేసేందుకు ఏసీబీకి సర్వహక్కులు లభించాయి. ఈ విడత ఏసీబీ వ్యూహం గతంలో కంటే చాలా భిన్నంగా, అత్యంత శాస్త్రీయంగా ఉంది. దాదాపు 65 మందికి పైగా ఉన్నతాధికారుల జాబితాను తయారు చేసిన ఏసీబీ, వారి ఆదాయానికి మించిన ఆస్తుల వివరాలను ఆరు నెలల పాటు నిఘా పెట్టి సేకరించింది. ఆస్తులను బినామీల పేరిట మార్చడం, రియల్ ఎస్టేట్ రంగాలు, విదేశీ ఖాతాల్లోకి మళ్లించడం వంటి సంక్లిష్టమైన నెట్‌వర్క్‌లను ఏసీబీ ఇంటెలిజెన్స్ ఛేదించింది. లంచం తీసుకుంటూ దొరికిపోయే "ట్రాప్" కేసులతో పాటు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులపైనే ప్రధానంగా దృష్టి సారించడం వల్ల బ్యూరోక్రసీలోని కీలక స్థానాల్లో ఉన్నవారు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా రెవెన్యూ , ల్యాండ్ సర్వే విభాగాల్లోని క్వాసి-జ్యుడీషియల్ వివాదాలను పరిష్కరించే క్రమంలో అధికారులు వందల కోట్ల విలువైన వివాదాస్పద భూములను అక్రమంగా క్రమబద్ధీకరించిన ఆధారాలు ఏసీబీ చేతికి చిక్కాయి. పాత క్వాసి-జ్యుడీషియల్ ఆర్డర్లను, సివిల్ కాంట్రాక్టుల మంజూరు ఫైళ్లను తిరగదోడుతుండటంతో గతంలో కీలక పదవుల్లో పనిచేసి, ప్రస్తుతం లూప్‌లైన్ లేదా కీలక శాఖల్లో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా ఈ ముప్పు పొంచి ఉంది. కేవలం క్షేత్రస్థాయి సిబ్బందిపైనే కాకుండా, అవినీతి మూలాలైన ఉన్నతాధికారుల వైపు ఏసీబీ దృష్టి మళ్లడం పరిపాలనా యంత్రాంగంలో పెద్ద ఎత్తున కలకలం రేపుతోంది.

అంతేకాకుండా, ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా నేతృత్వంలో ఈ వ్యవస్థలోనే అంతర్గత ప్రక్షాళ వేగంగా జరుగుతోంది. దాడుల సమాచారం ముందుగానే లీక్ కాకుండా ఉండేందుకు అత్యంత రహస్య బృందాలను రంగంలోకి దించడం, సోదాల సమయాన్ని డిజిటల్ సాక్ష్యాలుగా రికార్డు చేయడం వంటి సంస్కరణలు తెచ్చారు. గడిచిన కొద్ది నెలల్లోనే 190కి పైగా కేసులు నమోదు చేసి 14 ఏళ్ల రికార్డును తిరగరాయడం, ప్రభుత్వంలో రాజకీయ సంకల్పం స్పష్టంగా ఉందనడానికి నిదర్శనంగా మారుతోంది. ఈ క్రాక్‌డౌన్ కేవలం అక్రమార్కులను పట్టుకోవడానికే పరిమితం కాకుండా, రాష్ట్ర పౌర సేవల వ్యవస్థలో ఒక స్పష్టమైన హెచ్చరికను పంపడానికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వాలు మారినా, పాత అక్రమాలపై విచారణ తప్పదనే భావన అధికారుల్లో కలిగించడం ద్వారా పరిపాలనలో పారదర్శకత తేగలమని ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే రోజుల్లో వెలువడే ఐఏఎస్, ఐపీఎస్‌ల అరెస్టులు లేదా దాడుల వార్తలు తెలంగాణ రాజకీయ, పాలనా వర్గాల్లో మరిన్ని ప్రకంపనలు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఐదేళ్లలో 100 శాతం పెరిగిన బిలీయనర్లు

**న్యూఢిల్లీ,** : భారతదేశంలోని అత్యంత సంపన్నుల క్లబ్ ఇప్పుడు మరింత రద్దీగా మారింది. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పంచుకున్న డేటా ప్రకారం, అసెస్మెంట్ ఇయర్ 2025-26లో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక ఆదాయాన్ని నివేదించిన వ్యక్తుల సంఖ్య 576కి పెరిగింది. ఏజ 2024-25లో ఇదే సంఖ్య 415గా ఉంది. దేశంలో బిలియనీర్ల సంఖ్యలో పెరుగుదలను ప్రభుత్వం గమనించిందా అనే ప్రశ్నకు సమాధానంగా, ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక లిఖితపూర్వక సమాధానంలో ఈ గణాంకాలను అందించారు. కొన్నేళ్లుగా భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందింది. స్టాక్ మార్కెట్ అనూహ్యంగా పుంజుకోవడం, స్టార్టప్‌ల విస్తరణ, కొత్త కర్మాగారాలు, పరిశ్రమలలో పెట్టుబడులు, డిజిటల్ వ్యాపారాల విస్తరణ, పెరుగుతున్న కార్పొరేట్ లాభాల ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి అత్యంత స్పష్టమైన నిదర్శనం పార్లమెంటులో ప్రభుత్వం ఇటీవల గణాంకాలను సమర్పించింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం, 2025-26 అసెస్మెంట్ సంవత్సరంలో 576 మంది వ్యక్తులు తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లలో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక స్థూల ఆదాయాన్ని ప్రకటించారు. ఐదు సంవత్సరాల క్రితం 2021-22లో ఈ సంఖ్య కేవలం 142 మాత్రమే. అంటే ఐదేళ్లలో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ సంపాదించే వ్యక్తుల సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ఐటీఆర్‌లలో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక స్థూల ఆదాయాన్ని ప్రకటించిన వ్యక్తులను మాత్రమే ప్రభుత్వం లెక్కించింది.

రూ.100 కోట్లకుపైబడిన ఆదాయం ఉన్నవారు

2021-22 ఆర్థిక సంవత్సరంలో 142 మంది

2022-23లో 205 మంది

2023-24లో 395 మంది

2024-25లో 415 మంది

2025-26లో 576 మంది ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు, భారతదేశంలో వేగంగా జరుగుతున్న సంపద సృష్టికి ఇది ఒక సంకేతం. అలాగే ఇది ఆదాయపు పన్ను పరిధిని కూడా బలోపేతం చేస్తుంది. పార్లమెంటులోని ప్రశ్న 'బిలియనీర్ల'ను ప్రస్తావించినప్పటికీ, బిలియనీర్‌కు తమ వద్ద అధికారిక నిర్వచనం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దానికి బదులుగా, దేశంలోని అత్యధిక ఆదాయం సంపాదించేవారికి ప్రత్యామ్నాయంగా, రూ. 100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక ఆదాయాన్ని నివేదించే పన్ను చెల్లింపుదారుల ఆదాయపు పన్ను రిటర్న్ డేటాపై ఇది ఆధారపడింది. 100 కోట్ల క్లబ్ ఆవిర్భావం ప్రభుత్వానికి ఒక సానుకూల సంకేతంగా కూడా కనిపిస్తోంది. ఎక్కువ ఆదాయ ప్రకటనలు రావడం వల్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల మౌలిక సదుపాయాలు, సామాజిక కార్యక్రమాలు, మూలధన వ్యయాల కోసం ప్రభుత్వానికి మరిన్ని వనరులు సమకూరుతాయి.

# కాక్ రోచ్ కు నిధులపై ఆరా...

**న్యూఢిల్లీ** : కావలసినంత ఆహారం వచ్చింది. డ్రై ఫ్రూట్స్ ఊహించని విధంగా వచ్చాయి. మెడికల్ కిట్లు.. ఫాస్ట్ ఫుడ్.. డ్రింక్స్.. టెంట్లు.. రాళ్లు.. రప్పలు.. ఇవన్నీ ఆకాశరామన్న పంపించినట్టు పరుగులు పెట్టుకుంటూ వచ్చాయి. అసలు ఇవన్నీ ఎవరిచ్చారు.. ఎక్కడి నుంచి వచ్చాయి.. ఇంత ఖర్చు ఎవరు భరించారు.. అసలు ఆ పార్టీకి ఒక రూపం అంటూ లేదు. కనీసం క్షేత్రస్థాయిలో నిర్మాణం లేదు. కార్యకర్తలు లేరు. కేవలం సోషల్ మీడియా వేదికగా జరిగిన ప్రచారం ద్వారానే ఇంతటి ఉద్యమం పుట్టింది. మరి ఈ ఉద్యమం వెనుక ఉన్నది ఎవరు.. ఇప్పుడు ఈ విషయాలను బయట పెట్టే పనిలో పడ్డారు కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులు. కాక్రోచ్ జనతా పార్టీ లో అధికార ప్రతినిధిగా సౌరవ్ దాస్ కొనసాగుతున్నారు. ఈయనకు సంబంధించి బ్యాంక్ ఖాతా వివరాలను దర్యాప్తు సంస్థల అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి దిమ్మ తిరిగిపోయే నిజాలు తెలిసిపోయాయి. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ వ్యవహారంలో అసలు కోణం వేరే ఉందని తెలుస్తోంది. భారతీయ జనతా పార్టీ నాయకులు.. జాతీయ వాదులు అనుమానించినట్టుగానే.. దీని వెనక పెద్ద వ్యవహారం సాగిందని.. విదేశీ శక్తులు ఉన్నాయని ఇప్పుడు తెలుస్తోంది. సౌరవ్ దాస్ ఖాతాలో కొన్ని సంవత్సరాలుగా లక్షల డాలర్లు జమవుతున్నాయి. ఆమధ్య ఆయనకు 30 మిలియన్ డాలర్లు ఇచ్చేందుకు ఓ సంస్థ ముందుకు వచ్చిందని సమాచారం. అయితే ఆ డబ్బులు ఆయన ఖాతాలో పడలేదని తెలుస్తోంది. 16 మిలియన్ డాలర్లను నార్వేజియన్ ఏజెన్సీ ఫర్ డెవలప్మెంట్ కో ఆపరేటివ్ నో రాడ్ అనే సంస్థ ఇచ్చినట్టు సమాచారం. 2.4 మిలియన్ డాలర్లను లీడ్స్ ఫౌండేషన్ ఇచ్చినట్టు సమాచారం. తొమ్మిది లక్షల డాలర్లను ఓపెన్ సొసైటీ అనే సంస్థ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ స్థాయిలో డాలర్ల సొమ్ము రావడంతోనే ఉద్యమాన్ని ఈ స్థాయిలో నిర్వహించగలిగారని జాతీయవాదులు ఆరోపిస్తున్నారు. పైగా ఆయనకు 30 మిలియన్ డాలర్లు ఇస్తామని ఒక సంస్థ ఈమెయిల్ ద్వారా సమాచారం పంపించడం దర్యాప్తు సంస్థల అధికారులను కలవరపాటుకు గురి చేస్తోంది. ఎక్కడో విదేశాల్లో ఉన్న వ్యక్తులు.. ఇక్కడ ఉద్యమాలకు డబ్బు ఇవ్వడం ఏంటనేది అర్థం కావడం. మరోవైపు బొద్దింకలు ఆందోళనలు చేస్తున్నప్పుడు కెనడా వేదికగా కార్యాలపాలు సాగించే ఖలిస్థాన్ వేర్పాటు వాదులు తెర ముందుకు వచ్చారు. ఇండియాలో ఇదే స్థాయిలో ఆందోళనలు చేస్తే భారీగా డబ్బులు ఇస్తామని ప్రకటించారు. దీనినిబట్టి కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనల వెనుక విదేశీ శక్తులు ఉన్నాయని అర్థమవుతోంది. కేవలం డబ్బులు మాత్రమే కాకుండా ఆందోళనలు జరుగుతున్నప్పుడు అక్కడి యువత కోసం భారీగా ఆహారం వచ్చింది. దుస్తులు కూడా వచ్చాయి. ఇక రాళ్లు.. మెడికల్ కిట్లు.. డబ్బుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఇదంతా కూడా విదేశీ శక్తుల కుట్ర అని.. వారి మాయలో పడి మన విద్యార్థులు నాశనం కాకుండా ఉండడానికే ప్రభుత్వం ముందుగానే జాగ్రత్త పడిందని.. విద్యాశాఖ మంత్రితో రాజీనామా చేయించిందని జాతీయ వాదులు అభిప్రాయపడుతున్నారు. వచ్చే రోజుల్లో ఈ విచారణ మరింత వేగవంతంగా సాగితే అసలు నిజాలు బయటికి వస్తాయని.. అప్పుడు ముసుగు వీరులు.. కుట్ర వీరులు.. విదేశీ శక్తుల చేతిలో తొత్తులుగా మారిన వారు బయటపడతారని జాతీయవాదులు చెబుతున్నారు

# పాపం... సీఎస్...

# గెస్ట్ హౌస్, బంధువుల ఇళ్లలో మకాం...



**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వంలో అత్యున్నత అధికార పదవి అయిన చీఫ్ సెక్రటరీ హోదా ఎంతో గౌరవప్రదమైనది మరియు కీలకమైనది. వివిధ ప్రభుత్వ విభాగాలన్నింటికీ అధిపతిగా వ్యవహరించే సీఎస్, ముఖ్యమంత్రి అందుబాటులో లేనప్పుడు కీలక నిర్ణయాలు తీసుకునే బాధ్యతను నిర్వహిస్తారు. అయితే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజుకు ప్రస్తుతం అధికారిక నివాసం అందుబాటులో లేకపోవడం సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. సుదీర్ఘకాలం కేంద్ర సర్వీసుల్లో సేవలందించిన ఆయనకు హైదరాబాద్ నగరంలో సొంతిల్లు లేదు. దీంతో ఈ నెల సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయనకు నివాస ఇబ్బందులు తప్పడం లేదు. మొదట్లో బంధువుల ఇళ్లలో తలదాచుకున్న ఆయన, ప్రస్తుతం లోక్‌భవన్ సమీపంలోని దిల్‌ఖుషా గెస్ట్ హౌజ్‌కు మారువలసి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని తానై వ్యవహరించే ముఖ్య కార్యదర్శికి సరైన వసతి కరువవడం, తాత్కాలిక గెస్ట్ హౌజ్‌లలో కాలం వెళ్లదీయాల్సి రావడం పరిపాలనా వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.ప్రభుత్వం అధికారికంగా చీఫ్ సెక్రటరీ కోసం హైదరాబాద్‌లోని కుందన్‌బాగ్‌లో ఒక విశాలమైన బంగళాను నిర్మించి కేటాయించింది. రాష్ట్రం ఏర్పడిన తొలి రోజుల్లో రాజీవ్‌శర్మ, ఆ తర్వాత ఎస్‌కే జోషి వంటి సీనియర్ అధికారులు ఈ అధికారిక నివాసంలోనే తమ కుటుంబాలతో కలిసి నివసించారు. అయితే ఆ తర్వాత వచ్చిన సోమేశ్ కుమార్ అత్తాపూర్‌లోని తన సొంతింట్లో ఉండగా, శాంతికుమారి ప్రశాసన్ నగర్‌లోని స్వగృహంలో ఉన్నారు. ఆ తరువాత బాధ్యతలు నిర్వర్తించిన రామకృష్ణారావు కూడా ఈ బంగళాను ఉపయోగించలేదు. ఇలా దాదాపు ఐదారేండ్లుగా ఈ అధికారిక క్వార్టర్ ఖాళీగా ఉండటంతో, దాన్ని ప్రస్తుత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన క్యాంప్ ఆఫీసు అవసరాల కోసం వాడుకుంటున్నారు. ప్రస్తుతం ఆ బంగళాలో మంత్రికి సంబంధించిన మినిస్టీరియల్ సిబ్బంది ఉంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంత్రులందరికీ ప్రత్యేకంగా క్వార్టర్లు కేటాయించినప్పటికీ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాటిని తీసుకోకుండా సొంతింట్లో ఉంటున్నారు.మంత్రులకు ప్రభుత్వం నివాస వసతులు కల్పించినప్పటికీ, కేటాయించిన క్వార్టర్లలో కాకుండా ఇతర అధికారిక భవనాలను తమ అవసరాలకు వాడుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుందన్‌బాగ్‌లోని సీఎస్ బంగళా గత ఐదేళ్లుగా ఖాళీగా ఉండటంతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దానిని ఆక్రమించుకున్నట్లుగా పరిస్థితి తయారైంది. ప్రస్తుతం సంజయ్ జాజుకు నగరంలో సొంత ఇల్లు లేదని, ఆయన బంధువుల ఇళ్లు, గెస్ట్ హౌస్‌ల చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిసినప్పటికీ మంత్రి ఆ భవనాన్ని ఖాళీ చేయకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వంటి అత్యున్నత స్థాయి అధికారిక హోదా ఉన్న వ్యక్తికి సర్కారు బంగళా అందుబాటులో లేకపోవడం కేవలం ఒక గృహ సమస్య మాత్రమే కాదని, ఇది ఒక రకంగా ప్రభుత్వ వ్యవస్థలో నెలకొన్న సమన్వయ లోపానికి నిదర్శనమని సచివాలయ ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. అత్యున్నత అధికారిక హోదా ఉన్న వ్యక్తి నివాసం కోల్పోవడం ప్రభుత్వానికి పరోక్షంగా ఇబ్బందికర పరిణామంగా మారుతోంది.మంత్రులకు మరియు ఉన్నతాధికారులకు ఇళ్ల కేటాయింపుల విషయంలో నేరుగా ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితిని గమనించినప్పుడు, అత్యున్నత అధికారి ఎదుర్కొంటున్న నివాస సమస్యను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి హెడ్‌గా వ్యవహరించే చీఫ్ సెక్రటరీ అవసరాలను గుర్తించి, కుందన్‌బాగ్‌లోని అధికారిక బంగళాను తక్షణమే ఆయనకు కేటాయించాల్సిన బాధ్యత పెద్దల మీద ఉంది. దాదాపు నాలుగు వారాలుగా సీఎస్ ఎక్కడ ఉంటున్నారనే కనీస సమాచారం కూడా చాలామంది ఐఏఎస్ అధికారులకు పూర్తిగా తెలియకపోవడం గమనార్హం. కేవలం తాత్కాలిక బసల మీద ఆధారపడటం వల్ల అధికారిక విధులకు కూడా ఆటంకం కలిగే అవకాశం ఉంది. ఈ అంశంపై ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని, బంగళాను ఖాళీ చేయించి చీఫ్ సెక్రటరీకి అప్పగిస్తారా లేక వేరే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తారా అనేది ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ మరియు అధికార వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్న ప్రధాన విషయంగా మారింది.రాష్ట్ర పరిపాలనా యంత్రాంగానికి గుండెకాయ లాంటి సచివాలయంలో చీఫ్ సెక్రటరీ పాత్ర అత్యంత కీలకం. అలాంటి కీలక పదవిలో ఉన్న వ్యక్తికి నగరంలో శాశ్వత నివాసం లేకపోవడం, ప్రభుత్వం కేటాయించిన అధికారిక బంగళా కూడా అన్యాక్రాంతం కావడం పరిపాలనా వైఫల్యానికి అద్దం పడుతోంది. సీఎస్‌కు అఫీషియల్ రెసిడెన్సీ లేకపోవడం వల్ల విదేశీ లేదా అంతరాష్ట్ర ప్రతినిధులు కలిసే సందర్భాల్లోనూ ప్రొటోకాల్ పరమైన ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రజాప్రతినిధుల వ్యక్తిగత క్యాంప్ ఆఫీసులుగా మారడం సరికాదనే అభిప్రాయాలు మేధావి వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ సున్నితమైన అంశాన్ని తీవ్రంగా పరిగణించాలి. సీఎస్ సంజయ్ జాజు ఎదుర్కొంటున్న ఈ గృహ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ఆయన గౌరవానికి తగిన విధంగా అధికారిక బంగళాను వెంటనే ఆయన హ్యాండోవర్ చేసేలా చూడాలి. లేనిపక్షంలో ప్రభుత్వంలో ఉన్నతాధికారుల పట్ల అనుసరిస్తున్న తీరుపై మరింత వ్యతిరేకత వచ్చే అవకాశం లేకపోలేదు.

# నిలిచిపోయిన ఆర్థిక సంఘం నిధులు



వరంగల్, : లంగాణ రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వివిధ కారణాల వల్ల నిలిచిపోయాయి. జిల్లా, మండల పరిషత్‌లకు సకాలంలో ఎన్నికలు జరగకపోవడం వలన 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. నిబంధనల ప్రకారం ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాలకవర్గాలు ఉంటేనే ఫైనాన్స్ కమిషన్ నుంచి గ్రామీణ స్థానిక సంస్థలకు నేరుగా నిధులు వస్తాయి.తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వివిధ కారణాల వల్ల నిలిచిపోయాయి. జిల్లా, మండల పరిషత్‌లకు సకాలంలో ఎన్నికలు జరగకపోవడం వలన 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. నిబంధనల ప్రకారం ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాలకవర్గాలు ఉంటేనే ఫైనాన్స్ కమిషన్ నుంచి గ్రామీణ స్థానిక సంస్థలకు నేరుగా నిధులు వస్తాయి. రాష్ట్రంలోని జిల్లా, మండల పరిషత్‌ల గడువు 2024 జూన్‌తోనే ముగిసింది. దీనివల్ల 2024-25 అలాగే 2025-26 సంవత్సరాలకు సంబంధించి వీటికి రావాల్సిన రూ. 448.65 కోట్ల నిధులు ఆగిపోయాయి. ఎన్నికలు జరగని గ్రామ పంచాయతీలకు కూడా రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన నిధుల్లో మొత్తంగా రూ. 1,090.55 కోట్లు విడుదల కాకుండా పోయాయి. ప్రస్తుతం 16వ ఆర్థిక సంఘం ఉనికిలోకి రావడంతో గత ఆర్థిక సంఘం సిఫారసు చేసిన నిధులు క్యారీ ఫార్వర్డ్ కాలేదు. దీంతో జిల్లా, మండల పరిషత్‌లతో పాటు ఎన్నికలు జరగని గ్రామ పంచాయతీలకు నిధులు అందలేదు.రాష్ట్రంలో గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు 2024 ఫిబ్రవరిలోనే ముగియగా 2025 డిసెంబర్ వరకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో 2024-25 అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు అందలేదు. అయితే గతేడాది డిసెంబర్‌లో పంచాయతీ ఎన్నికలు పూర్తి కాగానే పాత బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్రానికి పలుమార్లు లేఖలు రాశారు. అలాగే నేరుగా ఢిల్లీకి వెళ్లి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితో సమావేశమై పరిస్థితిని వివరించారు. ఆ తర్వాత కొంతవరకు నిధులు విడుదలయ్యాయి. 15వ ఫైనాన్స్ కమిషన్ గడువులోగా సిఫారసుల మేరకు అందాల్సిన నిధులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 16వ ఫైనాన్స్ కమిషన్ గడువు మొదలైంది. దీంతో పాత కమిషన్ బకాయిలు కొత్త కమిషన్ హయాంలో క్యారీ ఫార్వర్డ్ ఆప్షన్ లేకపోవడంతో నిధులు మురిగిపోయినట్లయింది. నష్టపోయిన నిధులను తిరిగి తెప్పించుకునేందుకు రాష్ట్ర మంత్రి సీతక్క ప్రత్యేక ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఎలాంటి నిబంధనలు అలాగే లీగల్ చిక్కుల్లేనంత వరకు నిధులొస్తాయనే ధీమా అధికార వర్గాల్లో వ్యక్తమవుతున్నది.కేంద్ర ఆర్థిక సంఘం నిబంధనల ప్రకారం రాష్ట్రం నుంచి నిధుల విడుదలకు ప్రతిపాదనలు వచ్చే సమయానికి ఆయా గ్రామీణ స్థానిక సంస్థలకు అప్పటికే విడుదలైన నిధులన్నీ పూర్తిగా వినియోగమై ఉండాలి. గత ఆర్థిక సంవత్సరంలో రిలీజైన నిధులను సక్రమంగా ఖర్చు చేసినట్లు యుటిలైజేషన్ సర్టిఫికెట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు సమర్పించాలి. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు ఆలస్యంగా ఎన్నికలు జరగడంతో అప్పటివరకు రెడీ అయిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సమర్పించడంతో పాత బకాయిలు అందాయి. అందిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించనందున మరికొన్ని పంచాయతీలకు రావాల్సిన నిధులు పూర్తిగా రాలేదు. జిల్లా అలాగే మండల పరిషత్‌లు ఉనికిలోనే లేకపోవడంతో వాటికి రావాల్సిన రూ. 448.65 కోట్లు కూడా విడుదల కావడం పూర్తిగా అనుమానంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే ప్రతిపాదనలు అలాగే వినియోగ ధృవీకరణ పత్రాల ఆధారంగానే కేంద్రం నుంచి తదుపరి ఆర్థిక సహాయం ఆధారపడి ఉంటుంది.అధికారిక లెక్కల ప్రకారం జిల్లా పరిషత్‌లకు సంబంధించి 2024-25 సంవత్సరంలో రూ. 75.70 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా, బకాయి రూ. 75.70 కోట్లుగా ఉంది. అలాగే 2025-26 సంవత్సరంలో రూ. 73.85 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా, బకాయి రూ. 73.85 కోట్లుగా మిగిలింది. మొత్తంగా జిల్లా పరిషత్‌లకు రూ. 149.55 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా కాగా బకాయి కూడా రూ. 149.55 కోట్లుగా నమోదైంది. మండల పరిషత్‌ల విషయానికి వస్తే 2024-25 సంవత్సరంలో రూ. 151.40 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా, బకాయి రూ. 151.40 కోట్లుగా ఉంది. అలాగే 2025-26 సంవత్సరంలో రూ. 147.70 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా, బకాయి రూ. 147.70 కోట్లుగా నిలిచింది. మొత్తంగా మండల పరిషత్‌లకు రూ. 299.10 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా అలాగే బకాయి రూ. 299.10 కోట్లుగా తేలింది. ఈ గణాంకాలు స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితిని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.గ్రామ పంచాయతీల వివరాలను పరిశీలిస్తే 2024-25 సంవత్సరంలో రూ. 1,286.90 కోట్ల కేటాయింపు జరగగా రూ. 1,280.60 కోట్లు విడుదలయ్యాయి. దీనివల్ల కేవలం రూ. 6.30 కోట్లు మాత్రమే బకాయిగా మిగిలింది. అదేవిధంగా 2025-26 సంవత్సరంలో రూ. 1,255.45 కోట్ల కేటాయింపు జరగగా కేవలం రూ. 619.85 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. దీనివల్ల ఈ సంవత్సరంలో ఏకంగా రూ. 635.60 కోట్లు బకాయిగా నిలిచిపోయాయి. పంచాయతీలకు సంబంధించి ఈ నిధులొస్తేనే గ్రామీణాభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి. పాలకవర్గాలు కొలువుదీరిన తరుణంలో ఈ బకాయిల సాధనపైనే స్థానిక సంస్థల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం చేస్తున్న చొరవతో కేంద్రం నుంచి ఈ బకాయిలు వస్తాయని స్థానిక ప్రజలు ఆశిస్తున్నారు. లేదంటే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. పంచాయతీల ఆర్థిక పునరుజ్జీవనానికి ఈ నిధుల విడుదల అత్యంత కీలకమైన అంశంగా మారింది.

# పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిస్తే..


# నెలకు 25 కిలోల బియ్యం, రైస్ కుక్కర్, సైకిల్




**నల్గొండ,** : ప్రభుత్వ పాఠశాలను కాపాడేందుకు గ్రామపంచాయతీ వినూత్న నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించే కుటుంబాలకు నెలకు 25 కిలోల అదనపు బియ్యం, ఒక రైస్ కుక్కర్, ఐదో తరగతి పూర్తయ్యాక సైకిల్ అందించనున్నట్లు ప్రకటించింది. అదనంగా స్కూల్ బ్యాగ్, నోట్‌బుక్స్, విద్యా సామగ్రి ఉచితంగా ఇవ్వనున్నారు. సర్పంచ్ నేతృత్వంలోని ఈ పథకం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు సూర్యాపేట జిల్లా నాగులపహాడ్ గ్రామపంచాయతీ వినూత్న నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించిన ప్రతి కుటుంబానికి నెలకు 25 కిలోల అదనపు బియ్యం, ఒక రైస్ కుక్కర్, ఐదో తరగతి పూర్తిచేసిన విద్యార్థికి కొత్త సైకిల్ అందజేయనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ప్రస్తుతం సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు ఎక్కువగా మొగ్గుచూపడంతో ప్రభుత్వ పాఠశాల్లో అడ్మిషన్లు భారీగా తగ్గిపోయాయి.పరిస్థితి ఇలాగే కొనసాగితే పాఠశాల మూతపడే ప్రమాదం ఉందని.. గుర్తించిన నాగులపహాడ్ గ్రామపంచాయతీ, ప్రభుత్వ బడిని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించింది. నాగులపహాడ్ సర్పంచ్ నిరంజన్ రెడ్డి నేతృత్వంలోని గ్రామపంచాయతీ, విద్యార్థులకు విద్యతో పాటు కుటుంబాలకు కూడా ఆర్థికంగా కొంత ఊరటనిచ్చేలా ఈ పథకాన్ని రూపొందించింది. బియ్యం, రైస్ కుక్కర్, సైకిల్‌తో పాటు ప్రతి విద్యార్థికి ఉచితంగా స్కూల్ బ్యాగ్, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని కూడా అందించనున్నట్లు వెల్లడించింది. ఈ నిర్ణయానికి ఉపసర్పంచ్ రాయి రమేష్‌తో పాటు వార్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని.. గ్రామంలోని ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను ప్రభుత్వ బడిలోనే అభ్యసించాలని కోరారు. "మన ఊరి బడిని మనమే బతికించుకుందాం" అనే సందేశంతో గ్రామపంచాయతీ చేపట్టిన ఈ కార్యక్రమం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు తీసుకున్న ఈ వినూత్న చర్యపై పలువురు ప్రశంసలు కురిపిస్తుండగా.. ఇతర గ్రామాలు కూడా ఇలాంటి కార్యక్రమాలను అమలు చేయాలని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.ఇటీవలి కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం గమనార్హం. ప్రైవేటు స్కూళ్లను వదిలేసి.. ప్రభుత్వ స్కూళ్ల వైపు అడుగులు వేస్తున్నారు. గవర్నమెంట్ స్కూళ్లపై తల్లిదండ్రులకు ఉన్న అభిప్రాయాలు కూడా మారడంతో తమ పిల్లలను అందులోనే చేర్పిస్తున్నారు. కొన్ని స్కూళ్లలో అడ్మిషన్లు కూడా ఫుల్ కావడం విశేషం.

# అన్నదాతకు తీపి కబురు..

# సీడ్ మేళా ద్వారా విత్తనాలు



**హైదరాబాద్,** : ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగుచేస్తున్న రైతులకు అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం సీడ్ మేళాలు ప్రారంభించింది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లోని 2,604 రైతు వేదికల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడంతో పాటు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల ద్వారా ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేళాలను రైతులు సద్వినియోగం చేసుకొని నష్టాల నుంచి బయటపడాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో సరిగ్గా వర్షాలు కురవటం లేదు. ఈ నేపథ్యంలో అన్నదాతలను రక్షించేందుకు, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సీడ్ మేళాలు నిర్వహిస్తోంది. సోమవారం ప్రారంభమైన ఈ ప్రత్యేక విత్తన మేళా ఈనెల 29 వరకు కొనసాగనుంది. రాష్ట్రంలోని 32 జిల్లాల పరిధిలోని మొత్తం 2,604 రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు.రైతుల సౌకర్యార్థం ప్రతి రైతు వేదికలో 4 నుంచి 5 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్లలో కందులు, పెసలు, మినుములు, మక్కజొన్న, జొన్న, కూరగాయలతో పాటు వివిధ ఆరుతడి పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయాధికారులు వెల్లడించారు. కేవలం విత్తనాల పంపిణీయే కాకుండా.. విత్తన మేళాలో పాల్గొంటున్న వివిధ పరిశోధనా సంస్థల నిపుణులు, శాస్త్రవేత్తలు రైతులకు మార్గదర్శనం చేస్తున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్, కృషి విజ్ఞాన కేంద్రాల నిపుణులు స్థానికంగా అందుబాటులో ఉండి పంటల ఎంపిక, సాగు పద్ధతులపై సలహాలు ఇస్తున్నారు.మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా.. పరిస్థితులకు తగినట్లుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రాష్ట్ర అగ్రికల్చర్ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్ సూచించారు. పాడి రైతులు పశుగ్రాసం కొరత రాకుండా మేత జొన్నను సాగు చేసుకోవాలని, నగర శివారు ప్రాంతాల రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారించాలని కోరారు. తద్వారా తక్కువ కాలంలోనే మెరుగైన ఆదాయం పొందవచ్చునని అన్నారు. స్థానిక భౌగోళిక పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యత ఆధారంగా ఏఏ పంటలు సాగు చేయాలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎంపిక చేసుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి, శాస్త్రీయ సాగు విధానాలు అవలంబించడం ద్వారా పెట్టుబడి నష్టాలను పూర్తిగా నివారించవచ్చునని ఆయన స్పష్టం చేశారు.

# పాలిమర్స్ నోట్లు రెడీ

ముంబై, : దేశంలో రూ. 10, రూ. 20 డినామినేషన్‌లలో పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. 2012లోనే ఈ ఆలోచన చేసినా.. అనేక అవాంతరాలతో అమలు కాలేదు. తాజాగా ఆర్‌బీఐ పాలిమర్ కరెన్సీ ముద్రించాలని నిర్ణయించింది. దీంతో చాలా మందిలో ఇప్పటికే చలామణిలో ఉన్న కాగితపు నోట్లు రద్దు అవుతాయా ఇప్పటికే చలామణిలో ఉన్న కాగితపు నోట్లు రద్దు అవుతాయా ఒక సందేహం ఏర్పడింది. దీనికి కేంద్రం వివరణ ఇచ్చింది. కొత్త నోట్లు వచ్చినంత మాత్రాన పాతవి రద్దు చేయమని స్పష్టం చేసింది. రెండు రకాల నోట్లు కలిసి మార్కెట్‌లో ఉంటాయని తెలిపింది.కొత్త పాలిమర్ నోట్ల ప్రవేశం పాత కాగితపు నోట్ల స్థానాన్ని పూర్తిగా భర్తీ చేసేది కాదు. ప్రస్తుతం చలామణిలో ఉన్న నోట్లు కొనసాగుతాయి. ప్రజలు తమ దగ్గర ఉన్న కాగితపు నోట్లను ఏ మార్పు లేకుండా ఉపయోగించవచ్చు. రెండు రకాల నోట్లు ఏకకాలంలో మార్కెట్‌లో ఉండటంతో ఎలాంటి గందరగోళం లేదా అసౌకర్యం కలగదు. ఇది సాధారణంగా కరెన్సీ మార్పులలో జరిగే దశలవారీ విధానమే.నోట్ల మన్నిక పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం పాలిమర్ నోట్లు ముద్రించాలని నిర్ణయించింది. కాగితపు నోట్లు త్వరగా చిరిగిపోతాయి, మురికి పడతాయి, నీటికి లేదా వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేవు. పాలిమర్ మెటీరియల్‌తో తయారైన నోట్లు ఎక్కువ కాలం నిలుస్తాయి. దీనివల్ల ముద్రణ ఖర్చు తగ్గుతుంది, నోట్లు తరచుగా మార్చాల్సిన అవసరం తగ్గుతుంది. ఇది దీర్ఘకాలిక ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలకు దారి తీస్తుంది. 2012లోనే ఇలాంటి ప్రయత్నం జరిగింది. అయితే సాంకేతిక కారణాలతో అప్పుడు అమలు కాలేదు. ఇప్పుడు సాంకేతికత అభివృద్ధి చెందడంతో, అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధం కావడంతో ఈ నిర్ణయం మళ్లీ ముందుకు వచ్చింది. గత అనుభవాల నుంచి నేర్చుకుని జాగ్రత్తగా కేంద్రం అడుగులు వేస్తోంది.ప్రస్తుతం చేతిలో ఉన్న కాగితపు నోట్లను మార్చాల్సిన అవసరం లేదు. రెండు రకాల నోట్లు చెల్లుబాటు అవుతాయి. కొత్త నోట్లు క్రమంగా మార్కెట్‌లోకి వస్తాయి. దీనివల్ల ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదా భయాందోళనలు అవసరం లేదు. ప్రభుత్వం స్పష్టంగా చెప్పినట్టు, ఇది భర్తీ కాకుండా అదనపు ఎంపికగా వస్తోంది.

# భారీగా పెరగనున్న ఆస్తి పన్ను...

హైదరాబాద్, : హైదరాబాద్ నగరంలోని భవనాలు, స్థలాల యజమానులకు ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు కొనసాగుతున్న ఆస్తిపన్ను అసెస్మెంట్ విధానంలో మార్పులు తీసుకువస్తూ పాలకవర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై సాంప్రదాయ అద్దె ప్రాతిపదికన కాకుండా.. మార్కెట్ రేట్లకు అనుగుణంగా పన్నులు వసూలు చేసేందుకు వీలుగా కొత్త బిల్లును సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదిత నిబంధనలు అమల్లోకి వస్తే.. పట్టణ ప్రాంతాల్లో నివాస, వాణిజ్య ఆస్తులపై పన్ను భారం ఊహించని రీతిలో పెరగనుంది.హైదరాబాద్ నగరంలోని ఇళ్ల, వాణిజ్య సముదాయాల యజమానులపై ఆర్థిక భారం పెరగనుంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి స్వస్తి పలికి.. దానికి బదులుగా క్యాపిటల్ విలువ ఆధారంగా ఆస్తి పన్నును నిర్ణయించేందుకు ప్రభుత్వం సమగ్ర అర్బన్ రిఫార్మ్స్ (సీయూఆర్ఈ) ముసాయిదా బిల్లులో ప్రతిపాదనలు రూపొందించింది. ఈ నూతన సంస్కరణల వల్ల నగర పరిధిలోని నివాసాల యజమానులతో పాటు వాణిజ్య సముదాయాల యజమానులపై పన్ను భారం పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.కొత్తగా తీసుకురానున్న 'క్యూర్' ముసాయిదా బిల్లు ప్రకారం.. ఆస్తిపన్ను లెక్కించడానికి రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే భూమి, భవనాల క్యాపిటల్ విలువనే ప్రధాన ప్రాతిపదికగా తీసుకోనున్నారు. సాధారణంగా రియల్ ఎస్టేట్ రంగానికి అనుగుణంగా మార్కెట్లో భూముల ధరలు, భవనాల విలువలు ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంటాయి. దీనివల్ల పన్ను శాతాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పెంచకపోయినా, భూముల మార్కెట్ విలువ పెరగడం వల్ల ఆస్తి పన్ను కూడా ప్రతి ఏటా ఆటోమేటిక్‌గా పెరుగుతూ పోతుంది.ఈ కొత్త ముసాయిదా చట్టంలో ఆస్తుల రకాన్ని బట్టి పన్ను శాతాలను ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇళ్లకు సంబంధించి క్యాపిటల్ విలువపై 0.10 శాతం నుంచి 0.50 శాతం వరకు పన్ను స్లాబ్‌లను వర్తింపజేయాలని ప్రతిపాదించారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు సంబంధించి క్యాపిటల్ విలువలో 0.20 శాతం నుంచి గరిష్టంగా 2.00 శాతం వరకు పన్ను స్లాబ్‌లను విధించనున్నట్లు స్పష్టం చేశారు.

# జలుబు ఉన్నప్పుడు మజ్జిగ తాగితే...

సాధారణంగా ఇంట్లో ఎవరికైనా జలుబు లేదా దగ్గు వచ్చిందంటే, వెంటనే డైనింగ్ టేబుల్ నుండి పెరుగు, మజ్జిగ మాయమైపోతాయి. ఇవి తీసుకుంటే జలుబు ఇంకా ఎక్కువవుతుందని చాలా మంది నమ్ముతుంటారు.

అయితే ఇందులో ఎంతవరకు నిజం ఉందో శాస్త్రీయ కోణంలో విశ్లేషిస్తే ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. మజ్జిగలోని వే ప్రోటీన్ శరీరానికి అవసరమైన పోషణను అందిస్తుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం.. పులియబెట్టిన పాల ఉత్పత్తులు శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులను తగ్గించడంలో కూడా సహాయపడతాయి. వైద్యపరంగా చూస్తే.. జలుబు, దగ్గులు ప్రధానంగా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వస్తాయి. ఆహారం నేరుగా ఈ వ్యాధులను తీవ్రతరం చేస్తుందనడానికి ఎటువంటి బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు. ప్రముఖ వైద్యులు డాక్టర్ పి. ప్రవీణ్ కుమార్ రెడ్డి వివరణ ప్రకారం.. మజ్జిగను పూర్తిగా మానుకోవాల్సిన అవసరం లేదు, పైగా అది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మజ్జిగ తాగాలనుకునే వారు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. నేరుగా ఫ్రిజ్ నుండి తీసిన చల్లని మజ్జిగ తాగడం వల్ల గొంతు చికాకుకు గురై దగ్గు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న మజ్జిగనే వాడాలి. మజ్జిగలో అల్లం, మిరియాలు, జీలకర్ర వంటివి కలపడం వల్ల అది జీర్ణక్రియకు తోడ్పడటమే కాకుండా, శరీరానికి హాయినిస్తుంది.

అయితే రాత్రి సమయాల్లో కంటే, మధ్యాహ్న భోజన సమయంలో మజ్జిగ తీసుకోవడం ఉత్తమం. అయితే అందరి శరీర తత్వాలు ఒకేలా ఉండవు. మీకు తీవ్రమైన గొంతు నొప్పి, టాన్సిల్స్ వాపు లేదా జలుబు తీవ్రంగా ఉన్నప్పుడు కొన్ని రోజుల పాటు మజ్జిగకు దూరంగా ఉండటమే మంచిది. అలాగే, మజ్జిగ తాగిన వెంటనే లక్షణాలు పెరుగుతున్నట్లు అనిపిస్తే మీ వ్యక్తిగత సున్నితత్వాన్ని బట్టి నిర్ణయం తీసుకోవాలి. జలుబు లేదా దగ్గు ఎక్కువ కాలం తగ్గకుండా వేధిస్తుంటే, అది ఇతర ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు. అటువంటప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవడం అవసరం.



## మోకాళ్ల నొప్పులకు చెక్ పెట్టాలా?



వెనక్కి నడవడం అనేది వినడానికి వింతగా అనిపించినా, ఇది శరీరానికి, మెదడుకి ఒక సరికొత్త సవాలును విసురుతుంది. మనం రోజూ చేసే పనుల కంటే భిన్నంగా చేయడం లేదా కనీసం ప్రయత్నించడం వల్ల మెదడు మరియు నాడీ వ్యవస్థ వేగంగా స్పందిస్తాయి. ప్రతిరోజూ ఉదయం నిద్రలేవగానే మనం చేసే పనులు మన రోజంతా ఎలా గడవబోతుందో నిర్ణయిస్తాయి. సాధారణంగా అందరూ ముందుకు నడవడానికి అలవాటు పడతారు. కానీ, కేవలం 30 సెకన్ల పాటు వెనక్కి నడిస్తే మీ మెదడు, శరీరంపై అద్భుతమైన సానుకూల ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనిని 'రెట్రో వాకింగ్' అని కూడా పిలుస్తారు. బ్యాలెన్స్, స్టెబిలిటీ : వెనక్కి నడవడానికి ఎక్కువ ఏకాగ్రత, నియంత్రణ అవసరం. ఇది శరీరాన్ని సమతుల్యం చేసే సామర్థ్యాన్ని పెంచుతుంది. ముఖ్యంగా వృద్ధులలో పడిపోయే ప్రమాదాలను తగ్గిస్తుంది.కొత్త కండరాల ఉత్తేజం : ముందుకు నడిచేటప్పుడు పెద్దగా పని చేయని కండరాలు వెనక్కి నడిచేటప్పుడు యాక్టివ్ అవుతాయి. దీనివల్ల లోయర్ బాడీ స్ట్రెంగ్త్ పెరుగుతుంది.మోకాళ్ల నొప్పుల నివారణ : ఫిజియోథెరపీలో దీనిని ఒక చికిత్సగా వాడతారు.

## నిద్రపోయే ముందు పసుపు పాలు తాగితే బాడీలో ఏం జరుగుతుందో తెలుసా..?

పసుపు పాలు.. మన ఇంట్లో ఉండే అద్భుతమైన ఔషధం. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి మనం వెంటనే చేసే పని ఇదే. కానీ, ఆరోగ్యకరమైన ఈ పానీయాన్ని మీరు తాగే సమయం లేదా పద్ధతి తప్పైతే.. అది మీ శరీరానికి మేలు చేయడం పక్కన పెడితే, కీడు చేసే అవకాశం ఉంది. శతాబ్దాలుగా భారతీయ ఇళ్లలో పసుపు పాలు ఒక సంప్రదాయ ఔషధంగా కొనసాగుతున్నాయి.

రోగనిరోధక శక్తిని పెంచడంలో, గాయాలను మాన్పడంలో, రాత్రిపూట మంచి నిద్రను అందించడంలో దీనికి మించిన చిట్కా లేదని నమ్ముతారు. పసుపులో ఉండే కర్కుమిన్ అనే పదార్థంలోని యాంటీ-ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.

అయితే ఆరోగ్యకరమైన ఈ పానీయాన్ని తప్పుడు పద్ధతిలో లేదా తప్పుడు సమయంలో తీసుకుంటే శరీరానికి హాని కలుగుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.చాలా మందికి పసుపు పాలు తాగిన వెంటనే పడుకునే అలవాటు ఉంటుంది. కానీ పాలు జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. పాలు తాగిన వెంటనే నిద్రపోతే జీర్ణక్రియ మందగించి ఎసిడిటీ, కడుపు ఉబ్బరం, యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యలు తలెత్తుతాయి. పడుకోవడానికి కనీసం 1-2 గంటల ముందే పాలు తాగడం ఉత్తమం. ఎక్కువ పసుపు వాడితే ఎక్కువ ఆరోగ్యం అనుకోవడం పొరపాటు. పసుపును అధికంగా తీసుకోవడం వల్ల కడుపులో అసౌకర్యం, గ్యాస్, కడుపు నొప్పి, కొన్ని సందర్భాల్లో విరేచనాలు కూడా సంభవించవచ్చు. రోజుకు చిటికెడు లేదా అర స్పూన్ కంటే ఎక్కువ పసుపు వాడకూడదు. కొంతమంది ఖాళీ కడుపుతో



పసుపు పాలు తాగుతుంటారు. సున్నితమైన కడుపు ఉన్నవారికి ఇది సరిపడదు. దీనివల్ల కడుపులో చికాకు, ఎసిడిటీ లేదా అసౌకర్యం కలగవచ్చు. పసుపు పాలలోని పూర్తి ప్రయోజనాలు శరీరానికి అందాలంటే ఒక చిన్న చిట్కా పాటించాలి. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో కొద్దిగా నల్ల మిరియాల పొడి కలపండి. మిరియాలు కలపడం వల్ల పసుపులోని కర్కుమిన్‌ను శరీరం త్వరగా గ్రహిస్తుంది.

## అజీర్తికి చెక్ పెట్టే అద్భుతమైన ఆకులు...!



మన చుట్టూ ప్రకృతి ప్రసాదించిన అనేక మొక్కలు ఔషధ గుణాలను కలిగి ఉన్నాయి. ముఖ్యంగా మనకు ఈజీగా లభించే కొన్ని రకాల ఆకులు చర్మ సమస్యలకు, జీర్ణక్రియకు అద్భుతమైన పరిష్కారంగా పనిచేస్తాయి. రసాయనాలతో కూడిన ఉత్పత్తుల కంటే, ఇంట్లోనే లభించే ఈ సహజసిద్ధమైన ఆకులను ఉపయోగించడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా ఆరోగ్యాన్ని, అందాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ప్రస్తుత కాలంలో కాలుష్యం, మారిన ఆహారపు అలవాట్ల వల్ల చర్మ సమస్యలు, జీర్ణ సంబంధిత ఇబ్బందులు సర్వసాధారణం అయ్యాయి. వీటికి ఖరీదైన మందులు వాడటమే కాకుండా, మన వంటింట్లో లేదా పెరట్లో దొరికే కొన్ని పచ్చని ఆకులతో శాశ్వత పరిష్కారం పొందవచ్చు. వేపను 'సర్వరోగ నివారిణి' అని పిలుస్తారు.

వేప ఆకులను పేస్ట్‌లా చేసి మొటిమలపై రాస్తే అవి త్వరగా తగ్గిపోతాయి. చర్మంపై వచ్చే వేడి గడ్డలు, ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో వేప అద్భుతంగా పనిచేస్తుంది. తులసి కేవలం పవిత్రమైన మొక్క మాత్రమే కాదు, గొప్ప ఔషధం కూడా. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది. తులసి రసాన్ని ముఖానికి రాయడం వల్ల చర్మంపై ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది.


## అయినా అలాంటి మగాడితో బిడ్డను కంటానంటా!



కోలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి త్వరలో 'గట్ట కుస్తీ-2' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. గత ఏడాది మామన్ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నాను. ఇక ఇప్పుడు సూపర్ హిట్‌గా నిలిచిన 'గట్ట కుస్తీ' సీక్వెల్‌తో సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమయ్యారు. విష్ణు విశాల్ హీరోగా నటించగా.. చెల్లా అయ్యావు తెరకెక్కించారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాను జూలై 3న మూవీ మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈనేపథ్యంలో.. ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీ బిజీ అయిపోయిన ఐశ్వర్య లక్ష్మి తాజా ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, పెళ్లి గురించి చేసిన కొన్ని షాకింగ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. తనకు పెళ్లి బంధంపై ఉన్న భయాలు, అలాగే తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఐశ్వర్య లక్ష్మి మనసు విప్పి మాట్లాడారు.

గతంలో తనకు పెళ్లి బంధంలోకి ప్రవేశించడానికి చాలా భయాలు, సమస్యలు ఉండేవి అని ఆమె చెప్పారు. అసలు పెళ్లి చేసుకోవాలా వద్దా అనే సందిగ్ధత ఉండేదని, కానీ ఈ 'గట్ట కుస్తీ-2' సినిమా షూటింగ్ సమయంలో ఒక చిన్నారితో గడిపే అవకాశం వచ్చిందని వెల్లడించారు. ఆ పాపకు దగ్గరైనప్పుడు తనలోని మాతృత్వపు భావాలు ఒక్కసారిగా మేల్కొన్నాయని, ఒక బిడ్డకు జన్మనివ్వాలనే కోరిక తనలో కలిగిందని ఆమె వివరించారు. తనకు కాబోయే భాగస్వామి ఎలా ఉండాలనే దానిపై స్పందిస్తూ.. భవిష్యత్తులో తనకంటూ ఒక బిడ్డను కనాలనుకుంటున్నట్లు ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. అయితే, కనీసం తన పిల్లలకు ఒక మంచి తండ్రి అవుతాడని తాను నమ్మే వ్యక్తి, అలాగే ఏ కష్టం వచ్చినా తనను వదిలి పారిపోని ఒక తోడు కావాలని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి దొరికినప్పుడే తాను ఈ బంధాన్ని స్వీకరిస్తానని స్పష్టం చేశారు. పెళ్లి, జీవిత భాగస్వామిపై ఐశ్వర్య లక్ష్మి చేసిన కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

## మద్రాసు హైకోర్టును ఆశ్రయించిన ప్రముఖ డైరెక్టర్



'పరాశక్తి' సినిమా రెమ్యునరేషన్ విషయంలో మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు దర్శకురాలు సుధా కొంగర. సుధా కొంగర దర్శకత్వంలో డాన్ పిక్చర్స్ నర్మించిన 'పరాశక్తి' సినిమాలో శివకార్తికేయన్ హీరోగా, శ్రీలీల హీరోయిన్‌గా నటించారు. 2026లో విడుదలై ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద 11 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్లు వసూలు చేసిందని నిర్మాతలు ప్రకటించారు.

కానీ ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపించి తనకు ఇవ్వాల్సిన మిగిలిన రెమ్యునరేషన్ రూ. 8 కోట్లు ఎగ్గొట్టారని మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది దర్శకురాలు సుధా కొంగర. ఆమెకు చెల్లించాల్సిన మొత్తం చెల్లించకుండానే ఇప్పుడు అదే నిర్మాణ సంస్థ 'ఇదయం మురళి' అనే మరో సినిమాను నిర్మించి విడుదల చేయాలని చూస్తుందని సుధ కొంగర తరపు కౌన్సిల్ కోర్టులో వాదించింది. దీంతో సుధా కొంగరకు పూర్తి పారితోషికం చెల్లించేంత వరకు 'ఇదయం మురళి' సినిమా విడుదలను నిలిపివేయాలని కోర్టు సదరు నిర్మాణ సంస్థను ఆదేశించింది. అంతేకాకుండా.. ఈ కేసు తదుపరి విచారణ జరిగే వరకు 'పరాశక్తి' సినిమాను శాటిలైట్‌లో కూడా విడుదల చేయకూడదని కోర్టు స్పష్టం చేసింది.

## నా చిరకాల కోరిక నెరవేరుతుంది



యంగ్ హీరోయిన్ ప్రీతి ముకుందన్ చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ భారీ క్రేజ్ రాబట్టుకున్నారు. ఆమె చేసిన రెండు చిత్రాలు బాక్సాఫీసు వద్ద వరుసగా ఫ్లాప్ అయినప్పటికీ అమ్మడు క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు.

తనదైన లుక్స్, యాక్టింగ్ స్కిల్స్‌తో తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నారు. ఇటీవల ఆమె నటించిన 'బ్లాస్ట్' మూవీ సూపర్ హిట్‌గా నిలవడంతో పాటు, అందులో ప్రీతి చేసిన యాక్షన్ సీన్స్ అందరినీ ఎంతగానో ఆశ్చర్యపరిచాయి.

ప్రస్తుతం అదే జోష్‌లో ఉన్న ఈ భామ, కోలీవుడ్ హీరో అథర్వ మురళి నటిస్తున్న 'ఇదాయం మురళి' సినిమాలో ఒక కీలక పాత్రలో నటించారు. కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఆకాష్ బాస్కరన్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.ఎస్. తమన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది.

## రియా శింబుకు కోలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్!



యంగ్ బ్యూటీ రియా శింబు తమిళ, మలయాళ చిత్రాలతో నటిగా, నిర్మాతగా తనదైన ముద్ర వేశారు. 'కప్' మూవీతో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి వచ్చిన ఆమె 'సర్వం మాయ' సినిమాతో ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఊహించని క్రేజ్ రాబట్టుకున్న రియా ప్రస్తుతం తమిళంలో మోస్ట్ వాంటెడ్ బ్యూటీగా మారిపోయారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ సరసన చియాన్-63 ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ఆనంద శంకర్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 60 ఏళ్ల విక్రమ్‌తో 21ఏళ్లున్న రియా శింబు రొమాన్స్ చేస్తుండటం విశేషం. చియాన్ విక్రమ్ సినిమాతో పాటు, తాజాగా రియా శింబు కోలీవుడ్‌లో మరో లక్కీ ఆఫర్ దక్కించుకున్నట్లు టాక్ . టాలెంటెడ్ యాక్టర్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న సరికొత్త చిత్రంలో రియా శింబు హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ప్రసిద్ధ దర్శకురాలు కిరుత్తిగ ఉదయనిధి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన షూటింగ్ కూడా శరవేగంగా ప్రారంభం కాగా.. మరో వారం రోజుల పాటు నిర్విరామంగా కొనసాగించి ముఖ్యమైన సీన్స్ పూర్తి చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారట.

మానవ సంబంధాల మధ్య ఉండే సంక్లిష్టమైన భావోద్వేగాలను, పాత్రల మధ్య కెమిస్ట్రీని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంలో దర్శకురాలు కిరుత్తిగ ఉదయనిధికి మంచి పేరుంది. అందువల్ల, విజయ్ సేతుపతి, రియా శింబు కాంబినేషన్‌లో ఆమె నుండి ఒక మంచి ఎమోషనల్ అండ్ ఇంట్రెస్టింగ్ డ్రామా రాబోతున్నట్లు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. కోలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ స్టూడియోస్ భారీ నిర్మాణ విలువలతో, అద్భుతమైన విజువల్స్‌తో ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com